1

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | సెప్టెంబర్ 23, 2023 | www.navatelangana.com

కరెంట్ షాక్‌తో రైతు మృతి



నవతెలంగాణ-బిచ్కుంద

ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి రైతు మృతిచెందాడు. ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సీతారాంపల్లి గ్రామానికి చెందిన జాదవ్ లక్ష్మణ్ (40) తన సొంత పొలంలో మక్కపంటను కాపాడుకోవడానికి అడవి పందులు ఇతర జంతువులు వచ్చి పంట నష్టం చేయకుండా చుట్టూరా కరెంటు వైర్‌తో కంచె ఏర్పాటు చేసి అక్కడక్కడ బల్బులు పెట్టాడు. గురువారం రాత్రి పొలం కావలికి వెళ్ళిన లక్ష్మణ్ బలుపులు వెలుగుతున్నాయా లేదా అని పరీక్షిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కంచెగా వేసిన కరెంటు వైర్లకు తగలడంతో కరెంట్ షాక్ తలికి ఘటనా స్థలంలో మృతి చెందాడు. భార్య జాదవ్ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

25 నుంచి సమ్మె బాట

నవతెలంగాణ-ఎడపల్లి

ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గైని రాజమణి తెలిపారు. ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నయాబ్ తహసీల్దార్ జ్యోతికి ఆశావర్కర్లు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆశావర్కర్ల జిల్లా సంఘం అధ్యక్షురాలు రాష్ట్ర సిఐటియు నాయకురాలు ఏనుగు రాజమణి మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో ఆశావర్కర్లు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో డెలివరీ కోసం 3 రోజులు ఇల్లు విడిచి ఉండాల్సిన పరిస్థితి ఉందని దీంతో ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని, ఆశాలకు ఫిక్స్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆశావర్కర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు పంచశీల, విజయ, కుంట అనిత, గంగామణి, లత, రంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం

- కాంగ్రెస్ హయాంలో ప్రజాధనం దుర్వినియోగం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్ (బీర్కూర్)

అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని, డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం ఒక యజ్ఞం లాంటిదని, కాంగ్రెస్ పార్టీ హయాంలో గృహ నిర్మాణ పథకం పార్టీల కార్యకర్తలకు ప్రజాధనాన్ని దోచిపెట్టే పథకంగా ఉండేదని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండల పరిధిలోని సంబాపూర్, బైరాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రారంభోత్సవాలు శంకుస్థాపన చేశారు. సాంబాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో సంక్షేమ పథకాలు బాన్సువాడ నియోజకవర్గ రాష్ట్రంలోని ఆదర్శంగా నిలిచిందన్నారు. డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం ఒక యజ్ఞం లాంటిదని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ద్రోణవల్లి సతీష్, తనీయుడు పోచారం సురేందర్‌రెడ్డి కృషి వలన బాన్సువాడ నియోజకవర్గంలో 11వేల ఇండ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. ఒక్కొక్క ఇంటికి లక్ష పైగా నష్టం జరిగిన ప్రజల కోసం గృహ నిర్మాణాలు చేసి పంపిణీ చేసామన్నారు. గత కాంగ్రెస్ పార్టీ హయాంలో గృహ నిర్మాణ పథకం అవినీతిమయంగా మారిందన్నారు. 'కాంగ్రెస్ పార్టీ హయాంలో బాన్సువాడ నియోజకవర్గంలో 24 వేల ఇండ్లు మంజూరు కాగా పూర్తి ఇండ్లు మంజూరైనట్లు రికార్డులు చూపిస్తున్నాయని, అప్పుడు నిర్మించిన ఇండ్లు ఎక్కడ కట్టారో తెలియదు. నిరాశ్రయులైన ప్రజలు తలదాచుకోవడానికి ఇండ్లు నిర్మించి ఇవ్వడం కోసం చాలా కాలంగా బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకంలో 24వేల గృహాలు నిర్మించారు. ఈ లెక్కన చూస్తే ఈ నియోజకవర్గంలో అసలు ఇండ్లు లేని కుటుంబాలు ఉండకూడదు. కొత్తగా ఇండ్లు కట్టించాల్సిన అవసరమే ఏర్పడకూడదు. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటికీ వందల మంది పేదలు తమకు ఇండ్లు కావాలని ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకుంటూనే ఉన్నారు. దీన్ని బట్టి తేలుతున్నదేమిటంటే ప్రభుత్వ లెక్కల్లో ఉన్నట్లు ఇండ్ల నిర్మాణం కాలేదన్నది అసలు వాస్తవం. ప్రజాధనం అవినీతి పరుల జేబుల్లోకి చేరిందన్నది కూడా అంతే వాస్తవం. ప్రజల ప్రాథమిక అవసరం నెరవేర్చాలని ప్రారంభమయిన గృహ నిర్మాణ పథకం లక్ష్యం మారి పార్టీల కార్యకర్తలకు ప్రజాధనాన్ని దోచిపెట్టే పథకంగా మారింది. గ్రామంలోని కుటుంబాల సంఖ్య కంటే ఇండ్లు ఎక్కువ మంజూరు చేయించుకుని బిల్లులు కాజేసిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలో కుటుంబాల సంఖ్య కన్నా 40 శాతం అధికంగా ఇండ్లు మంజూరు కావడం, వాటికి బిల్లులు కూడా చెల్లించబడడం అవినీతి ఏ స్థాయిలో జరిగిందో చెప్పడానికి ఓ ఉదాహరణ. పాలకులు, అధికారులు కలిసి కుమ్మక్కై ప్రజాధనం దుర్వినియోగం చేశారు' అని ఆరోపించారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు 11 వేల ఇండ్లు నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ఎంపిపి రఘు, మాజీ జడ్పిటిసి ద్రోణవల్లి సతీష్, ఎంపిటిసి సందీప్ పాటిల్, ఆర్డీఓ బుజంగరావు, కో ఆప్షన్ మెంబర్ అరిఫ్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ద్రోణావల్లి అశోక్, సొసైటీ అధ్యక్షులు డివిడి శ్రీనివాస్ యాదవ్, కొల్లి గాంధీ, రామ కృష్ణగౌడ్, జడ్పిటిసి స్వరూప తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్

విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫీజు దీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలోని ధర్నాచౌక్‌లో ఫీజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని అన్నారు. అదేవిధంగా బడ్జెట్లో కేటాయింపుల్లో విద్యారంగానికి ఎప్పుడూ మొండి చూపే చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న 5,177 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్‌ను విడుదల చేయాలని అన్నారు. అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచిన వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్ విడుదలతో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లను జారీ చేయాలని అన్నారు. సెల్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయకుండా పూర్తి ఫీజు ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కాగా ఈ దీక్షలను ఐటిఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రావు హాజరై ప్రారంభించారు. దీక్షను ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ విరమింపజేశారు. దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.మహేష్, నాగరాజు జిల్లా కో కన్వీనర్ దీపిక, జిల్లా సహాయ కార్యదర్శి విశాల్, తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, వెంకటేష్, బోధన్ డివిజన్ కార్యదర్శి సాయికుమార్, జిల్లా నాయకులు జవహర్, నాయకులు నీలిమ, వరదరాజు, సందీప్, దినేష్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత చేప పిల్లలను సద్వినియోగం చేసుకోవాలి

- జుక్కల్ శాసనసభ్యులు హనుమంత్ షిండే

నవతెలంగాణ-బిచ్కుంద

మత్స్యకారుల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో ఉచిత చేప పిల్లల పంపిణీని, వాహనాలపై ప్రభుత్వ సబ్సిడీని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని అసెంబ్లీ ప్యానల్ స్పీకర్, జుక్కల్ శాసనసభ్యులు హనుమంత్ షిండే అన్నారు. శుక్రవారం బిచ్కుంద మండల కేంద్రాన్ని అనుకొని ఉన్న కమ్మర్ చెరువులో ప్రభుత్వం ద్వారా ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలను వదిలారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జుక్కల్ శాసనసభ్యులు హనుమంత్ షిండే మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు మత్స్యకారులను పూర్తిగా విస్మరించిందని తెలంగాణ ఏర్పడిన తర్వాత చేపల పెంపకాన్ని వదిలి ఏదో ఒక కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్న మత్స్యకారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి భరోసా కల్పించి మత్స్యకారుల కుటుంబాల్లో తిరిగి వెలుగు నింపారని ఇందులో భాగంగానే గత నాలుగేళ్లుగా మత్స్యకారులకు 100 శాతం సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. చెరువులో వేసిన చేపలను ఎప్పటికప్పుడు చేపల స్థితిగతులను పర్యవేక్షించాలని అప్పుడే చేపలు పెరుగుదల కనిపిస్తుంది అన్నారు. పెరిగిన చేపలను బ్రోకర్లకు విక్రయించకుండా మత్స్యకారులే ప్రభుత్వం కేటాయించిన మార్కెట్ స్థలాల్లో నేరుగా విక్రయించి లాభాలు గడించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. చేపల రవాణా కోసం 40 శాతం సబ్సిడీతో వాహనాలను ప్రభుత్వం అందిస్తుందని దీంతోపాటు మత్స్యకారులకు ఐదు లక్షల ప్రమాద బీమా అంగవైకల్యం కలిగిన వారికి ఐదు లక్షలు, అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్సలు తీసుకున్న వారికి 25 వేల రూపాయల వరకు అందిస్తున్నామన్నారు. ఈ సదవకాశాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో చేపలు విక్రయించడానికి స్థలం కేటాయించగా ఆ స్థలంలో మార్కెట్ షెడ్, కమ్యూనిటీ హాల్ తమ కుల దైవమైన గంగమ్మ గుడి నిర్మాణానికి నిధులు కేటాయించాలని సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తానని సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరిబాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటరావుదేశాయ్, ఎఫ్ఎం సాజిద్, ఎఫ్ఏలు జయరాం, సంఘం అధ్యక్షులు బాలబోయ్, ఉపాధ్యక్షులు లక్ష్మబోయ్, నాయకులు బొమ్మల లక్ష్మణ్, హనుమాన్లు, రాజాగౌడ్ మత్స్యకార సంఘం సభ్యులు ఉన్నారు.



చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

తెలంగాణకు పెద్ద దిక్కు కేసీఆర్

- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ రాష్ట్రానికి పెద్ద దిక్కు కేసిఆర్ మాత్రమేనని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొనసముందర్, నర్సాపూర్, ఇనాయత్‌నగర్, అమీర్‌నగర్ గ్రామాల్లో పర్యటించిన ఆయన సుమారు రూ. 10 కోట్ల పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

కొనసముందర్ గ్రామంలో రూ.కోటి 50లక్షలతో కొనసముందర్ నుండి శుక్రవారం దేవి ఆలయం వరకు రోడ్డు, రూ.కోటి 30 లక్షలతో శుక్రవారం దేవి ఆలయం వద్ద మైనర్ బ్రిడ్జ్, రూ.60లక్షలతో కొనసముందర్ నుండి చౌట్ పల్లి రోడ్డు వయా నర్సాపూర్ రోడ్డుపై స్లాబ్ కల్వర్టు, రూ.93 లక్షలతో కొనసముందర్ అమీర్‌నగర్ రోడ్డు బిటి పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. నర్సాపూర్ గ్రామంలో రూ.కోటి 50 లక్షలతో నర్సాపూర్ గ్రామం నుండి సోమరాగిడి తండా వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన, ఇనాయత్‌నగర్ గ్రామంలో రూ. కోటి 30 లక్షలతో ఇనాయత్ నగర్ నుండి ఉక్లా నాయక్ తండా వరకు రోడ్డు, రూ. కోటి 60లక్షలతో ఇనాయత్ నగర్ నుండి అమీర్‌నగర్ వయా సర్పంచ్ తండా గట్టు పొడిచిన వాగుపై బ్రిడ్జ్ నిర్మాణం, రూ.23లక్షలతో ఇనాయత్‌నగర్ కొత్త చెరువుపై సూపర్ ప్యాసేజ్ నిర్మాణం ఆన్ ఫీడర్ చానల్ శంకుస్థాపన, అమీర్‌నగర్ గ్రామంలో రూ.6లక్షల నియోజకవర్గ అభివృద్ధి నిధులతో సింగిల్ విండో గోడౌన్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భాస్కర్ యాదవ్, కోటపాటి నర్సింహ నాయుడు, అబద్ధం చిన్నారెడ్డి, ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, జెడ్పిటిసి సభ్యురాలు పెరుమాండ్ల రాధా రాజరాజ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, ఆర్డీవో వినోద్‌కుమార్, సర్పంచులు రూప రాజేందర్, పెండే ప్రభాకర్, సునావత్ లస్కర్, పుప్పల గంగాధర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న మంత్రి వేముల

బాల్య వివాహాలు లేని భారతదేశాన్ని నిర్మిద్దాం

నవతెలంగాణ-తాడ్వాయి

బాల్య వివాహాలు లేని భారతదేశాన్ని నిర్మిద్దామని కమ్యూనిటీ మోబిలైజర్ ప్రీతి తెలిపారు. సాధన సంస్థ ఆధ్వర్యంలో తాడ్వాయి గ్రామంలో బాల్య వివాహాలు లేని భారతదేశంగా నిర్మిద్దామని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కైలాష్ సత్యార్థి చైల్డ్రెన్స్ ఫౌండేషన్ సహాయంతో చేపడుతున్న ఆక్సెస్ టు జస్టిస్ ఫర్ అల్ ప్రోగ్రాం గురించి మాట్లాడారు. అలాగే బాలల అక్రమ రవాణా జరిగినట్టు తెలిసినా, చూసిన ఎక్కడైనా కనపడిన సంబంధిత అధికారులతో పాటు సాధనా సంస్థ ప్రతినిధులకి తెలపాలని అన్నారు.

బాధిత కుటుంబానికి మేడపాటి ఆర్థిక సాయం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని బిజెపి పార్టీ బూత్ సభ్యులు మల్లెపూల సాయిలు రెండు సంవత్సరాల కుమారుడు కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. దాంతో సమాచారం తెలుసుకున్న బిజెపి బోధన్ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన వంతు ఆర్థిక సాయం చేశారు. బాధిత కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట బోధన్ మండల అధ్యక్షులు మనోహర్, ప్రధాన కార్యదర్శి వాసు, జిల్లకర్ర ప్రవీణ్, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులున్నారు.

హార్వెస్టర్‌ను లీజుకు ఇవ్వడానికి అధికారుల అనుమతులు తీసుకోవాలి

నవతెలంగాణ-రెంజల్

ఇటీవల ఐకెపి ద్వారా కొనుగోలు చేసిన హార్వెస్టర్‌తో నష్టాలే తప్ప లాభాలు రావడం లేదని ఐకెపి సిబ్బంది పేర్కొనడంతో హార్వెస్టర్‌ను లీజుకు ఇవ్వడానికి అధికారుల అనుమతులు తీసుకోవాలని ఎంపీపీ లోలపు రజిని కిషోర్, జడ్పిటిసి మేక విజయ సంతోష్, ఎంపీడీవో శంకర్ సూచించారు. శుక్రవారం 17వ మహాజనసభ నిర్వహించారు. నూతన పాలకవర్గాన్ని ఎన్నుకోగా.. గతంలో పనిచేసిన మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మిని తిరిగి ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మాధవి, కోశాధికారిగా స్వరూపను నూతనంగా ఎన్నుకున్నట్లు ఇన్చార్జి ఏపీఎం భాస్కర్ తెలిపారు. మండల కేంద్రంలోని వనిత గ్రూప్ లో అవ్వకతవకలు జరిగినట్లు సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ సభ దృష్టికి తీసుకురాగా, ఈనెల 25న ఐటీపీ సిబ్బంది మొత్తం ఆ గ్రూపులకు సంబంధించిన రికార్డులను విచారించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి, ఇన్చార్జి ఏపీఎం భాస్కర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఐకెపి సిసిలు శివకుమార్, కృష్ణ, రాజయ్య, సునీత, శ్రీనిధి అధికారిని షాలిని, మండలంలోని గ్రామ అధ్యక్షులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి నిధుల మంజూరు

నవతెలంగాణ-మాచారెడ్డి

మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి 25 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేణుగోపాలస్వామి ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఇందులో భాగంగా రూ.25లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పిటిసి మినుకూరి రామిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్‌లో అంగన్‌వాడీల నిరసన

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల పోషణను విస్మరిస్తే చర్యలు

- వికలాంగులపై వివక్ష చూపకూడదు
- కలెక్టర్ జితేష్ పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి

వయోవృద్ధుల పోషణ చేయని వారి (పిల్లలు) వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జిల్లా వయోవృద్ధుల కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణను వారి కుటుంబ సభ్యులు చూడకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వృద్ధులు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రక్త పరీక్షలు చేయించుకోవాలని, వీటిని పూర్తిగా ఉచితంగా చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని వయోవృద్ధులు వినియోగించుకోవాలని సూచించారు. వృద్ధులను వారి కుటుంబ సభ్యులు ఇబ్బంది పెడితే జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులకు తెలియజేయాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు వారి తల్లిదండ్రులను పోషణ చేయక పోతే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వయోవృద్ధులకు సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణపై సలహాలు, సూచనలు అందించాలని కోరారు. వయో వృద్ధులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు ఉచితంగా చేయాలని ప్రతినిధులు సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ సాయన్న, జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య, ప్రతినిధులు రాజేశ్వరరావు, బైరయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులపై వివక్ష చూపిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం వికలాంగుల హక్కుల చట్టం 2016పై దివ్యాంగుల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దివ్యాంగులను గౌరవించే విధంగా ప్రభుత్వ కార్యాలయాలలో బోర్డులు ఏర్పాటు చేసే విధంగా చూడాలని తెలిపారు. అర్హత గల వారందరికీ దివ్యాంగుల పింఛన్లు ఇప్పిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాలలో దివ్యాంగులకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు ఇప్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటు హక్కుపై దివ్యాంగుల కమిటీ సభ్యులు దివ్యాంగులకు అవగాహన కల్పించాలని కోరారు. మీసేవ, ఆన్లైన్లో దివ్యాంగులకు ఎదురయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కారం చేయాలని సూచించారు. పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పరికరాలు అందేలా చూడాలని కమిటి ప్రతినిధులు సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ అధికారి బావయ్య, కమిటీ ప్రతినిధులు పోచవ్వ, సాయిలు, రాజమౌళి, నాగరాజు, బాలయ్య, మంజుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ఉచిత చేపల పంపిణీలో అక్రమాలు



చనిపోయిన చేప పిల్లలు సరఫరా

నవతెలంగాణ-బిచ్కుంద

మత్స్యకారులకు ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం ద్వారా ఉచితంగా చేప పిల్లల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యంతో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. చనిపోయిన చేప పిల్లలు సరఫరా చేయడం.. వాటిని పర్యవేక్షించాల్సిన సహకార సంఘాల సభ్యులు పర్యవేక్షించకపోవడంతో ప్రభుత్వ ఆర్డర్లకు అనుగుణంగా చేప పిల్లల సరఫరా చేయాల్సిన గుత్తేదారు నాణ్యమైన చేపల సరఫరా చేయకపోవడంతో పాటు హాని చేసే చేపలు, చనిపోయిన చెప పిల్లలను సరఫరా చేస్తుండడంతో మత్స్యకారుల అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

బిచ్కుంద మండల కేంద్రంలోని కమ్మర్ చెరువులో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాల్సిన చేప పిల్లల్లో అధికారులు, గుత్తేదారుల అక్రమాలు బట్టబయలు అయ్యాయి.

ఉచిత చేప పిల్లల సరఫరాలో రౌట, బొత్స, బంగారుతీగ చేపలు సరఫరా చేయాల్సి ఉండగా అందులో పాంట ప్లేట్ (దయ్యం చేప)లు కలిపి సరఫరా చేయడం సరఫరా చేసిన చేపల్లో చనిపోయిన చేపలు ఉండడంతో మత్స్యకారులు పాంటప్లేట్ (దయ్యంచేప) చెరువులో వేయడం వల్ల మిగతా చేప పిల్లలను తినేస్తుందని పాంట ప్లేట్ చేపకు చుట్టూరా ముండ్లు ఉండడం వలన పట్టేటప్పుడు మత్స్యకారులు గాయాల పాలవుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఈ చాప మార్కెట్లో కొనేవారు ఉండరని నాణ్యమైన చేపల సరఫరా చేయాల్సిన గుప్తదారు చనిపోయిన చేపలు సరఫరా చేయడం ఏంటని ఈ చేపలు చెరువులో వేయడం వల్ల చెరులో గతంలో వేసిన చేపలు నష్టపోయి తీవ్ర నష్టం వచ్చే అవకాశాలు ఉన్నాయని మత్స్యకారులు జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డిని ప్రశ్నించారు. చనిపోయిన చేపలు కొన్ని కల్తీ చేపలు రావడాన్ని పట్టించుకోవద్దని ఇలాంటి ఘటనలు సర్వసాధారణమని అందులోంచి తీసి పక్కన పారేయమని సలహా ఇవ్వడంతో మత్స్యకారులు వాపోయారు. అధికారులు, గుత్తేదారులు ఉచిత చేప పిల్లల పంపిణీలో జరుగుతున్న అక్రమాలు ఏపాటియే కళ్లకు కట్టినట్లు బట్టబయలు అయ్యాయి. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి నాణ్యమైన చేప పిల్లల సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

లారీ ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన భిక్కనూర్ పట్టణంలోని మల్లన్నగుడి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఎల్లవ్వ (75) కర్నల గల్లి నుంచి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి వృద్ధురాలిని ఢీకొనగా అక్కడికక్కడే మరణించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని హజ్గుల్ మంజీర పరివాహక ప్రాంతం నుండి అనుమతుల పేరుతో వేరే చోటికి ఇసుకను తరలిస్తున్న కందర్‌పల్లి గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. అనుమతులు ఉన్నచోట కాకుండా బ్లాక్ మార్కెట్లో విక్రయించడానికి ప్రయత్నించారని తమకు సమాచారం అందగానే పట్టుకొని బిచ్కుంద పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి శాఖ పరమైన చర్యలు నిమిత్తం తహసిల్దార్‌కు సమాచారం అందించినట్టు ఎస్ఐ తెలిపారు.

డీజేలకు పర్మిషన్ లేదు : ఎస్ఐ ఆంజనేయుల

నవతెలంగాణ-తాడ్వాయి

గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం యూత్ నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులకు ఎంతో పవిత్రమైన పండుగ వినాయక చవితి అని తెలిపారు. ఈ పండుగ ఉత్సవాలు అందరూ ఎంతో సంతోషంగా, ఉత్సాహంగా నిర్వహించుకోవాలన్నారు. గణేష్ నిమజ్జనోత్సవాల సమయంలో ఎలాంటి గొడవలు పెట్టుకోకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బల్వంతరావు

నవతెలంగాణ-రాజంపేట్

రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్‌గా నియమితులైన బిక్కాజి బల్వంత్ రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను కలిశారు. అనంతరం ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బల్వంత్ రావును శాలువాతో సత్కరించారు. అనంతరం బల్వంత్‌రావు మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్‌గా నియమించినందుకు సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజుబుద్దిన్, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు, పిఎసిఎస్ చైర్మన్ నల్లవెల్లి అశోక్, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, శివాయిపల్లి సర్పంచ్ విట్టల్‌రెడ్డి, అంద్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 43 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను శుక్రవారం పంపిణీ చేసినట్లు బి.ఆర్.యస్ మండలాధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబర్ మోహినోద్దీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శీనునాయక్, గాదారి అశోక్‌రెడ్డి, అల్తాఫ్, వడ్ల రాజేందర్, జడ్పీటీసీ కమిలి నర్సింలు, గైని రమేష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం కోసం యంచ గోదావరి వద్ద పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో

నవతెలంగాణ-నవీపేట్

వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ ఆర్డీఓ రాజేందర్ యంచ గోదావరి వద్ద ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. నిజామాబాద్ జిల్లా నుండే కాకుండా కామారెడ్డి, హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుండి గజనాధుల నిమజ్జనానికి గోదావరికి వస్తుండడంతో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ధన్వాల్, ఆర్ఐ మోహన్, నాయకులు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

షీ టీం ఆధ్వర్యంలో అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలూర్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "షీ టీమ్ " అవేర్నెస్ ప్రోగ్రాం శుక్రవారం నిర్వహించి అవగాహనా కల్పించారు. ఈవ్ టీజింగ్ చేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని షీ టీం కానిస్టేబుళ్లు విగ్నేష్, సుమతి, అన్నారు. పిఎస్ ఆర్మూర్ నందు సైబర్ క్రైమ్ గురించి విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. అనంతరం షీ టీం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శౌరి రెడ్డి , ఉపాధ్యాయులు విద్యార్థినిలు సుమారు 250 వరకు పాల్గొన్నారు.

హెల్మెట్లు పంపిణీ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

డ్రైవింగ్ లైసెన్స్ లేని యువత గురించి నాయకులకు పదే పదే ఫోన్ లు రావడంతో విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి ప్రశాంత్ రెడ్డి తన సొంత డబ్బులతో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ పంపిణీ చేసే సమయంలో ఉచితంగా హెల్మెట్లను కూడా పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు శుక్రవారం మంత్రి పేరు మీదుగా స్థానిక నాయకులు యువతకు హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, ఎంపీటీసీ జక్కని మధు సూధన్,బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్,నాయకులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

తహసీల్దార్ కార్యాలయంలోరెండు గ్రామాల లబ్ధిదారులకు షాధిముబారక్ చెక్కులను ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డితో పాటు తహశీల్దార్ వనజ రాణి ముగ్గురు లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సినియర్ నాయకులు ఎంపీపీ సామ పద్మ వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు మునీరొద్దీన్, కొమ్ముల మోహన్ ఆర్.ఐ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘ భవనానికి నిధుల మంజూరు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలోని మహిళ సంఘ భవనం నిర్మాణం కోసం రూ.5 లక్షల నిధులను రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంజూరు చేశారు. శుక్రవారం వేల్పూర్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రూ.5 లక్షల నిధుల మంజూరు పత్రాన్ని మహిళా సంఘం సభ్యులకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్కారం అశోక్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్, నాయకులు ఏనుగు గంగారెడ్డి, గోవర్దన్, శ్రీనివాస్, సర్గం రమేష్, ఎర్రవ్వ, గంగామణి, మహిళా సంఘాల సిఏలు రజిత, కృష్ణవేణి, రుచిత, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షలకు ఆకుల లలిత సంఘీభావం



మద్దతు తెలుపుతున్న ఆకుల లలిత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లో గత 25 రోజులుగా యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న దీక్షకు తెలంగాణ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షులు వి దత్తాహరి మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు 1445 మందిని వెంటనే రెగ్యులర్ చేయాలని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత ను కోరారు.ఈ సందర్భంగా ఆకుల లలిత మాట్లాడుతూ ఈ నెల 25 న కేటీఆర్ పోచంపాడు ప్రాజెక్టు కు వస్తున్నారని తెలిపారు. కేటీఆర్‌ను కల్పించే ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.18 రోజులుగా కొనసాగుతున్న రిలే దీక్షల్లో తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్ డాక్టర్ అపర్ణ, డాక్టర్ శ్వేతా, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ డానియల్, డాక్టర్ నర్సింలు, డాక్టర్ బి.ఆర్ నేత, డాక్టర్ స్వామి రావు, తో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

న్యాక్ సన్నాహక సమావేశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉన్నత విద్యాసంస్థలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఆర్థికపరమైన మద్దతుకు న్యాక్ అక్రిడియేషన్ తప్పనిసరి అయిందని తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జీ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ ఐఏఎస్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదగిరి యూనివర్సిటీ లో జరిగిన న్యాక్ సన్నాహక సమావేశంలో తెలిపారు. యూనివర్సిటీ లో మౌలిక వసతుల కల్పనకు, బోధన సిబ్బంది, పరిశోధకులకు అవసరమైన ప్రాజెక్టుల నిర్వహణకు , ల్యాబ్ ల ఏర్పాట్లకు విద్యార్థుల ఫెలోషిపులకు న్యాక్ గుర్తింపు అనివార్యమైందని, ఈ విషయాన్ని అందరూ గుర్తించాలని రిజిస్ట్రార్ సూచించారు. ఈ గుర్తింపు ద్వారానే యూనివర్సిటీ కి భవన నిర్మాణ గ్రాంట్ల తో పాటు మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక మద్దతు పొందవచ్చునన్నారు. ఏ క్యూ ఏ ఆర్ ను ఏ విధంగా సిద్ధం చేయాలో అధ్యాపకులతో చర్చించి వారికి సంపూర్ణ అవగాహన కల్పించి దాని రూపకల్పనలో పరిగణంలోకి తీసుకోవాల్సిన అంశాలపై మార్గ నిర్దేశనం చేశారు. న్యాక్ గ్రేడ్ పొందడం కోసం బోధన బోధనేతర సిబ్బంది తమ శక్తి వంచన లేకుండా విధిగా పనిచేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

సైన్స్ బిల్డింగును తనిఖీ చేసిన రిజిస్ట్రార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో రూసా నిధులతో నిర్మిస్తున్న సైన్స్ బిల్డింగ్ నిర్మాణాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవదాస్ కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కాంట్రాక్టర్ రాజన్నకు సూచనలు ఇచ్చారు. నిర్మాణాన్ని నిర్ణయించిన గడువులోపు పూర్తిచేసి యూనివర్సిటీకి అప్పగించాలని సూచించారు.కార్యక్రమంలో యూనివర్సిటీ అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించండి.. లేదంటే సమ్మెకే

- పంచాయతీరాజ్ టెక్నికల్ ప్రాజెక్టు మేనేజర్లు, ఈ పంచాయతీ ఉద్యోగులు
- అధికారులకు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్/డిచ్‌పల్లి



నిజామాబాద్: వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు



డీపీవోకు వినతి

డిమాండ్లు పరిష్కరించండి.. లేదంటే సమ్మెలోకి వెళ్తామని నిజామాబాద్: జిల్లాలో పంచాయతీరాజ్ శాఖలోని టెక్నికల్ వ్యవస్థలో పనిచేస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు అన్నారు. ఈమేరకు శుక్రవారం జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ జయసుధకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, జిల్లాలో 33 మంది ప్రాజెక్టు మేనేజర్లు 1619 మంది ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆపరేటర్లను జూనియర్ అసిస్టెంట్ లేదా తత్సమాన హెూదా, దీంతోపాటు కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే అన్ని వసతులు వర్తింపచేయాలని కోరారు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌కు, ఎంపీడీవో, ఎంపీవోకు వినతి పత్రం ఇచ్చినట్టు తెలిపారు.

డిచ్‌పల్లి:పంచాయతీరాజ్ శాఖలో టెక్నికల్ వ్యవస్థలో గడిచిన 8 ఏళ్లగా పనిచేస్తున్న 33 మంది జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు పే స్కేలు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న 1619 మంది ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ లేదా తత్సమాన హెూదా కల్పించాలని, ఈ-పంచాయతీ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్‌గా నియమించాలని తెలంగాణ ఈ పంచాయతీ టెక్నికల్ వింగ్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు.శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ గోవింద్, జిల్లా పంచాయతీ అధికారిని డాక్టర్ జయసుధ, డివిజన్ పంచాయతీ అధికారి నాగరాజు కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే అన్ని వసతులతో తమకు కూడా వర్తింప చేయాలని కోరారు.ఇప్పటికే ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కు బుధవారం వినతిపత్రం అందజేసినట్టు వారు వివరించారు. సమస్యలను ఈ నెల 26 వరకు పరిష్కారించాలని లేకుంటే 27నుండి సమ్మె లోకి వెళ్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి జిల్లా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపిఎం ఏ నరహరి, ప్రసాద్, శివాజీ, సతీష్, నితీష్, ఉమా, అనుష పాల్గొన్నారు.

ఎన్సీఎస్ఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

రైతంగా సనస్యలను పరిష్కరించా లని ఎన్సిఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలని అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాని డిమాండ్ చేసారు. అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకెఎంఎస్) జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రం లో గల ఎన్ఆర్ భవన్ లో జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోబంలో పడుతుందని ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కారించడంలో విఫలం అవుతున్నాయని అ న్నారు. దేశ వ్యాపితంగా రైతుల అప్పులన్నీ మాఫీ చేసి రైతును రుణ విముక్తుల్ని చెయ్యాలని అందుకుగాను పార్లమెంట్ లో రుణ విమోచన చట్టాన్ని, ఎంఎస్పి మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని తీసుకరావాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ లోనే సహకార రంగంలో కొనసాగిన ఏకైక చక్కెర ఫ్యాక్టరీ ఎన్సిఎస్ఎఫ్ సారంగాపూర్ గత పాలకుల తప్పుడు విధానాల ఫలితంగా, చక్కెర పాలసీల మూలంగా ఫ్యాక్టరీ మూతపడిందని ఆయన అన్నారు. అధికారం లోకి వస్తే 100 రోజుల్లో ఫ్యాక్టరీ తెరిపిస్తామన్నా బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది ఏండ్లు దాటినా తెరిపించలేదన్నారు. రైతులను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వనికి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయాని అయన అన్నారు. ఎన్సిఎస్ఎఫ్ ఫ్యాక్టరీని ప్రభుత్వం తెరిపించి నడిపించాలని, లేదా ఫ్యాక్టరీ పై ఉన్న అప్పులను మాఫీ చేసి 1995 యాక్టు (చట్టం) ప్రకారం రైతులకు అప్పాజెప్పాలనే డిమాండ్ తో అక్టోబర్ 3 న ఇందూరు పరస్పర సహకార చక్కెర సంఘం, చెరుకు ఉత్పత్తి దారుల సంఘంల ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించబోతుందని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చెయ్యాలని తీర్మానించించినట్టు తెలిపారు. ఈ సమావేశం లో ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయరెడ్డి, ఉపాధ్యక్షులు టి. కృష్ణ గౌడ్, అగ్గు ఎరన్న , బి.సాయిలు, సహాయ కార్యదర్శులు బి. దేవస్వామి, ఏ.చిన్నయ, పి.మర్క్స్, బాబురావు, బి.బుచ్చన్న, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్



వినతిపత్రం అందజేస్తున్న ఎండీఎం కార్మికులు

మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 28 నుంచి సమ్మె చేస్తామని సమ్మె నోటీసులు తహసీల్దార్ శ్రీకాంత్ కు, ఎంఈఓ ఆఫీస్‌లో లత కు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) మండల కార్యదర్శి జక్కం సుజాత మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లును మధ్యాహ్నం ఇప్పటివరకు రాలేదని అన్నారు. నిజామాబాద్ డిఈఓకు హైదరాబాద్ కమిషనర్ కు కలిసి మాట్లాడామన్నారు. బకాయి ఉన్న బిల్లులు ఈ నెల 28వ తేదీ వరకు జమ కాకపోతే సమ్మె చేస్తామని అన్నారు. పెండింగ్లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని జులై నెల నుంచి మూడు వేల రూపాయల వేతనాన్ని వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమ్మెకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు దయమని , నిర్మల, బిజాంబి, కమర్, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/ధర్పల్లి

నిజామాబాద్ నగరంలోని పలు గణపతి మండపాల అన్నదాన కార్యక్రమాలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దన్ పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. నగరంలో వందలాది గణేష్ మండపాలు నెలకొల్పడం ఆనందంగా ఉందని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ బిల్లుల పేరు మీద ఇబ్బందులు కలగచేయద్దు అన్నారు. గణేష్ మండప నిర్వాహకులకు అధికారులు సహకరించాలన్నారు ప్రెస్ క్లబ్ గణేష్ మండలి, దడువాయి గణేష్ మండలి, గౌతమ్ నగర్ లోని వైశ్య గణేష్ మండలిలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ మాస్టర్ శంకర్, గోపిడి వినోద్ రెడ్డి, బట్టికారి ఆనంద్, పవన్, ప్రెస్ క్లబ్ సభ్యులు శేఖర్, ప్రమోద్, బాలు, సందీప్ కృష్ణ, దడువై సభ్యులు శ్రీనివాస్ గౌడ్, గణేష్, పాపేశ్వర్ సభ్యులు పాల్గొన్నారు.

ధర్పల్లి :మండల కేంద్రములో శుక్రవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గణపతి మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, తహసీల్దార్ మహంతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.

ఆకులు, అలములు తింటూ నిరసన

నవతెలంగాణ-మాక్లూర్

ఎంపీడీఓ కార్యాలయం ముందు మధ్యాహ్న బోజన కార్మికులు వేతనాలు, పెండింగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదని ఆకులు, అలములు తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్షురాలు సాయమ్మ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్యముకులకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా 2022 మార్చిలో ప్రతి ఒక్క మధ్యాహ్న భోజన కార్మికునీకి నెలకు రూ 3 వేలు చెల్లిస్తానని హామీ ఇచ్చి కాలయపన చేస్తూ 2023 జూన్ లో జీవో తెచ్చినప్పటికీ చెల్లించడం లేదన్నారు. ఐదు నెలల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్మికులు రాజవ్వ, రమణ, సుహాసిని, సావిత్రి, సరిత పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయడం అభినందనీయం

జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్

విద్యార్థులలో నిబిడీకృతమైన సృజనాత్మకతను వెలికితీయడానికి ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ సంస్థ ఎంతగానో ప్రోత్సహిస్తుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల విద్యార్థుల లో నిగూఢమైన శక్తిని వెలికి తీయడంలో నూతన ఉత్సాహాన్ని, ప్రేరణ కలిగించడంలో , విద్యార్థులలో ఉత్తేజాన్ని, ఆనందాన్ని పెంపొందించడంలో ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. బాలికల కళాశాల ప్రిన్సిపల్ నుసరత్ జహన్ మాట్లాడుతూ ఇన్స్పైర్ అండ్ ఇగ్నైట్ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. ఇన్స్పైర్ ఇగ్నైట్ సభ్యులు దాసరి రంజిత్, అనీష్, సుధాకర్, నరహరి మాట్లాడుతూ విద్యార్థినిలలో సృజనాత్మకత, భావ వ్యక్తీకరన, నైపుణ్యము పెంపుదల, తల్లిదండ్రులు, అధ్యాపకుల పైన గౌరవం, సమాజంలో విలువలు, అవాంఛనీయ సంఘట నలు ఎలా ఎదుర్కో వాలి, ఎలా జీవించాలి అనే విషయాలపై అవగాహన కల్పిం చారు. విద్యార్థులలో జ్ఞాపక శక్తిని పెంపొందించుకునే విధంగా వారి యొక్క జీవనశైలిని మార్చుకునేందుకు మంచి భవిష్యత్తును నిర్మించుకునేందుకు సూచనలు సలహాలు చేశారు. అధ్యాప కులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేకు.. ఆరు పథకాలకు మధ్య పోటీ

- కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



గ్యారెంటీ కార్డు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీకి ఆరు పథకాలకు మధ్య పోటీ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన గడపగడప కాంగ్రెస్‌తోపాటు పార్టీ కార్యాలయం ప్రారంభించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున దరఖాస్తు చేసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు మార చంద్రమోహన్, కోల వెంకటేష్, తలారి పోచన్న, యల్ల సాయిరెడ్డి, గొర్త రాజేందర్, అశోక్ గౌడ్ గార్లు పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ సెప్టెంబర్ 17న తుక్కుగూడలో అభయహస్తం పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలకు సంబంధించిన గ్యారెంటీ కార్డు కరపత్రాలు ప్రజలకు ఇచ్చి పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు ప్రతినెల రూ.2500, రూ. 500 గ్యాస్ సిలిండర్, ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తుందని, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందని తెలిపారు. రైతుబంధు పేరుతో టిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం భూస్వాములకు మేలు చేసే విధంగా మాత్రమే దానిని రూపొందించిందని కానీ రైతు భరోసా పథకం ద్వారా కౌలు రైతులకు కూడా ఏటా 15 వేల రూపాయలు అందిస్తుందని భూమిలేని వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలి అందజేస్తుందని చెప్పారు. ఇండ్లు లేని వారికి ఇంటి స్థలం, ఐదు లక్షలు అందజేస్తుందని, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని అందజేస్తుందని తెలిపారు. యువ వికాసం ద్వారా విద్యార్థులకు 5 లక్షల రూపాయల విద్యా భరోసా కార్డుతోపాటు ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తుందని, అలాగే చేయూత పథకం ద్వారా 4వేలు రూపాయల నెలవారి పింఛను అందిస్తుందని చెప్పారు. 10 లక్షల రూపాయల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా అందజేస్తుందన్నారు. టిపిసిసి ఉపాధ్యక్షుడు తాహిర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమం వెల్లివిరిస్తుందని ప్రజలందరూ ఇప్పుడున్న బి ఆర్ ఎస్ పార్టీని ఓడించాలని కాంగ్రెస్ చేతి గుర్తుయిఅ ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, మాక్లూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీవన్,రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ ప్రమోద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, నందిపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంద మహిపాల్, డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూమేశ్వర్ రెడ్డి, మాక్లూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవి ప్రకాష్, ఆలూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్, ఫత్తేపూర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు శ్రీ సరస్వతీ విద్యా మందిరం విద్యార్థులు



జిల్లాస్థాయి వాలీబాల్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-భీమ్‌గల్

పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఏవో నర్సారెడ్డి తెలిపారు. వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో జరిగిన జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలో ఏడుగురు శ్రీ సరస్వతి విద్యా మందిర్ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ బసంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఏవో నర్సారెడ్డి లో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, నరేష్ గంగాధర్ పాల్గొన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శనివారం | సెప్టెంబర్ 23, 2023 | www.navatelangana.com

వరి పంటకు మొగి పురుగు



పంటను పరిశీలిస్తున్న మేనేజర్

నవతెలంగాణ-పిట్లం

వరి పంటకు మొగి పురుగు, తెగుళ్ల సోకినట్లు ట్రాక్టర్ బ్రాండ్ కంపెనీ ఏరియా మేనేజర్ నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో ట్రాక్టర్ బ్రాండ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో వరి పంటలో మొగిపురుగు, తెగుళ్ల సోకడంతో వరి పంట ఆశించిన స్థాయిలో కనబడడం లేదన్నారు. వీటి నివారణకు గాను మిషన్ ఎస్సీ, ఇజూకి పల్సర్ మందులను వాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కంపెనీ సెల్స్ రి ప్రజెంటేటివ్ నరసింహారెడ్డి, సేల్స్ ట్రైనీలు బాలకృష్ణ, బాలేశ్వర్, సాయి రైతులు పాల్గొన్నారు.

కొడిచెరలో పశు వైద్య శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని కొడిచెర గ్రామంలో శుక్రవారం పశు వైద్య, పశుసంవర్ధక శాఖ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, కోడిచెర సర్పంచ్ సంతోష్ పటేల్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 40 గేదెలకు, 26 ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. అలాగే 45 దూడలకు నట్టల నివారణ మందులు, టీకాలు, 96 పశువులకు ప్రథమ చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డా.సంతోష్, సర్పంచ్ సంతోష్ పటేల్, ఏఎంసీ చైర్మన్ సంగమేశ్వర్, కొడిచర పశు వైద్యసిబ్బంది డా.పి.సంతోష్, వెటర్నరీ అసిస్టెంట్ ఫిరోజ్‌ఖాన్, అటెండర్ హనుమంత, గోపాలమిత్ర సూపర్‌వైజర్ బస్వరాజ్, గోపాలమిత్రలు పరమేష్, నాగ్‌నాథ్, పండరి, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ పోచారంకే మా ఓటు

- సాంబాపూర్ గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-నసురుల్లాబాద్ (బీర్కూర్)



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికే తమ ఓటు వేస్తామని బాన్సువాడ నియోజకవర్గంలోని సాంబాపూర్ గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తమ ఓట్లు బీఆర్ఎస్ పార్టీకే వేస్తామని.. ప్రతిపక్షాలు తమ ఊరికి ప్రచారం కోసం రావద్దంటూ గ్రామస్తులు తీర్మానించుకున్నారు. శుక్రవారం సాంబాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి సాంబాపూర్ గ్రామం బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఉంటుందని, గ్రామస్తులందరం బీఆర్ఎస్‌కే ఓటు వేస్తామని తీర్మానం చేసి తీర్మాన పత్రం అందజేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మాత్రమే ఈ సారి ఓట్లు వేయాలని నిర్ణయించుకున్నామని, అందువల్ల తమ ఊరికి ఓట్ల కోసం ఇతర పార్టీల నాయకులు రావద్దని గ్రామస్తులు సూచించారు. గ్రామస్తులు చేసిన తీర్మానాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తూ వారికి హామీ ఇచ్చారు. సాంబాపూర్ గ్రామాన్ని త్వరలో గ్రామ పంచాయతీగా ఏర్పడుతుందని త్వరలో గ్రామపంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో బైరాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉందని, వేరే పంచాయతీల ఆధీనంలో ఉండేదని తెలిపారు. తమ గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని వారు ఎన్నిసార్లు వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదని, అయితే తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో వీటికి కూడా స్థానం లభించిందని స్పీకర్ తెలిపారు. సాంబాపూర్ నూతన గ్రామపంచాయతీ కార్యాలయం ఏర్పడుతుందని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు స్పీకర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గణేష్ మండపాల వద్ద అన్నదానాలు



అన్నదానం చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను రోజువారిగా నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని వీరభద్ర గణేష్ మండలి, శివాలయం వద్ద, అలాగే పలు గ్రామాలలోని వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మంగళ్‌పహాడ్, కుర్నాపల్లి, తానాకలాన్, జానకంపేట్, పోచారం, అంబం.వై, ఏఆర్‌పీ క్యాంప్, బ్రాహ్మణపల్లి, వడ్డేపల్లి తదితర గ్రామాలలో అన్నదానం చేపట్టారు.

నేడు బిచ్కుంద మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అశోక్ పటేల్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. ఈ సమావేశానికి జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని అధికారులు తమ శాఖపరమైన పూర్తి నివేదికలతో సరైన సమయానికి గ్రామ సర్పంచులు, మండల డివిజన్ స్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

సోయా పంట పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని మద్నూర్ గ్రామ శివారు అలాగే ఆవలగావ్ గ్రామ శివారును క్లస్టర్ వ్యవసాయ అధికారి ఏఈఓ ప్రియాంక శుక్రవారం సందర్శించి పరిశీలించారు. సోయా పంటకు కాండపు ఈగ బెడద అధికంగా కనిపిస్తుందని గుర్తించారు. సోయా పంటకు సోకిన కాండపు ఈగ పురుగుల నివారణ గురించి ఆమె రైతులతో మాట్లాడుతూ అధికారుల సలహాలు సూచనలు మేరకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. పంటల రక్షణ కోసం వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు మేరకే మందులు వాడుకోవాలని ఇష్టం వచ్చినట్టు మందులు వాడకూడదని తెలియజేశారు. రైతు సమన్వయ సమితి కన్వీనర్ సాయిలు, వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్నూర్ గ్రామంలో 2 నెలల క్రితం గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ అయ్యాం నవీన్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రూ.20000 ఆర్థిక సహాయాన్ని నవీన్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయవ్వ, ఉపసర్పంచ్ శివపటేల్, ఎంపీటీసీ రాంచందర్ రావు, వార్డ్ మెంబర్లు గుడ్ల గంగారాం, నరేష్‌గౌడ్, వీరనరావు, మల్లయ్య, సుధాకర్, పంచాయతీ సెక్రటరీ దేవీసింగ్, గ్రామస్థులు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు బియ్యం, నగదు అందజేత

నవతెలంగాణ-బోధన్

వినాయక మండపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడానికి, గణేష్ నవరాత్రి ఉత్సవాలు మరింత ఘనంగా జరుపుకోడానికి ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ తనవంతుగా బియ్యంతో పాటు ఆర్థిక సహాయం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా బోధన్ పట్టణంలోని 100 గణేష్ మండపాలకు, నియోజకవర్గంలో గణేష్ మండపాలకు 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. వినాయక ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించుకోవాలని ఆయేషా ఫాతిమా సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, ఫ్లోర్‌లీడర్ బెంజర్ గంగారాం, కౌన్సిలర్ ధూప్‌సింగ్, తోకల గంగారెడ్డి, నక్క లింగారెడ్డి, స్వామి, దాస్, మధు పాల్గొన్నారు.

వినాయక మండపం వద్ద అన్నదానం

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండల కేంద్రంలో బస్టాండ్ పరిధిలో గల శ్రీ విగ్నేశ్వర కాలనీలో విగ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ సాయన్న అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయకునికి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

3వ రోజు మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

నవతెలంగాణ-బోధన్



నిరసన తెలుపుతున్న కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం 3000 రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలని కోరుతూ చేపడుతున్న నిరసన సమ్మె బోధన్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం 3వ రోజు కొనసాగింది. మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెను జిల్లా కార్యదర్శి రూపా ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమా మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాన్ని ఏప్రిల్ 2022 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఉన్న బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని, ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఒక విద్యార్థికి రూ.25 స్లాబ్ రేటు ఇవ్వాలని, నిత్యావసర వస్తువులు గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. వంట షెడ్లు, వంట పాత్రలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, సామాజిక ప్రమాద బీమా పథకం అమలు పరచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, కార్మికులకు ప్రతినెల 5వ తేదీన బిల్లులు వేతనాలు చెల్లించాలని అన్నారు. కేరళ ప్రభుత్వం రోజుకు 600 రూపాయలు చెల్లిస్తున్నట్లుగా తెలంగాణ ప్రభుత్వం కూడా వారికి చెల్లించాలన్నారు. ఈ సమ్మెలో శ్యామ్‌రావు, భారతి, రమ, పద్మ, కాంతమ్మ, ఇబ్రహీం, గౌస్ ఉద్దీన్, ఈశ్వరీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో టవర్ నిర్మాణం చేపట్టొద్దు

నవతెలంగాణ-మద్నూర్



మాట్లాడుతున్న గ్రామస్తులు

ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో సెల్ టవర్ నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్తులు కోరారు. మండలంలోని లచ్చన్ గ్రామంలో ఎవరి అనుమతులు లేకుండా ఎయిర్టెల్ టవర్ నిర్మాణం పనులు చేపడుతున్నారని, ఆ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ ఆ గ్రామ పెద్దలు తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సర్పంచ్ కుటుంబీకులు మాజీ సర్పంచ్ టవర్ నిర్మాణం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతంలోనే కాకుండా చుట్టుపక్కల ప్రజల ఇళ్ల మధ్యలో నిర్మాణం పనులు చేపట్టడం టవర్ నిర్మాణం పట్ల ఇటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అటు ఇండ్లలో నివసించే ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని ఇక్కడ ఎయిర్టెల్ టవర్ నిర్మించవద్దని గ్రామస్తులు కోరారు. టవర్ నిర్మాణం చేపట్టడానికి గ్రామానికి దూరంలోని చెరువు పక్కన ప్రభుత్వ స్థలం ఉందని అక్కడ నిర్మాణం చేపడితే సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని సర్పంచ్ కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం టవర్ నిర్మాణం కోసం గుంతలు తవ్వి పెట్టడం గ్రామస్తుల అనుమతులు లేకుండానే చేపట్టే వాటి పట్ల గ్రామస్తులంతా టవర్ నిర్మాణం పనులు నిలిపివేయాలని కోరారు.

సొంతింటి కల నెరవేరుస్తున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి
- లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీ అందజేత

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



ప్రొసిడింగ్ కాపీ అందజేస్తున్న ఎంపీపీ

సొంతింటి కల నెరవేరుస్తున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని విట్టల్‌వాడీ గ్రామస్తులకు గృహలక్ష్మి ధ్రువపత్రాలను లబ్దిదారులకు ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఆర్థికసాయంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.60 నుంచి రూ.70వేలు మాత్రమే ఇచ్చేవారని, దాంట్లో ఏఈలకు, పైరవీకారులకు పోను మిగతావి వచ్చేది కూడా కష్టంగా ఉండేదని తెలిపారు. బేసిమెంట్‌కు రూ.లక్ష, స్లాబ్‌కు రూ.లక్ష, ప్లాస్టరింగ్‌కు రూ.లక్ష చొప్పున రూ.3లక్షలు నేరుగా లబ్దిదారులైన మహిళల ఖాతాల్లో తమ ప్రభుత్వం వేస్తుందని వివరించారు. గృహలక్ష్మి కోసం నాయకులకు, అధికారులకు నయాపైసా లంచం ఇవ్వవద్దని, ఎవరైనా అడిగితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో శ్రావణ్, సర్పంచ్ దీప్‌చంద్, ఏఎంసీ డైరెక్టర్ నాందేవ్, పాక్స్ డైరెక్టర్ శామా, బీఆర్ఎస్ నాయకులు రూప్‌సింగ్, కిషన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం



ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

వికలాంగ విద్యార్థులు ఫిజియోథెరపీ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విశాలాక్షి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భవిత సెంటర్లో ఉచిత ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత సెంటర్లో విద్యనభ్యసిస్తున్న పదిమంది వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు వికలాంగ విద్యార్థులకు వ్యాయామం క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆమె సూచించారు. ఫిజియోథెరపీ పరీక్షలు, వ్యాయామంలతో అవయవలోపం నివారణకు కృషి చేస్తాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ దేవిసింగ్, ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-మద్నూర్

కిశోర బాలికలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఓ తెలిపారు. శుక్రవారం మద్నూర్ మండల కేంద్రంలో గల అంగన్వాడి కేంద్రాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ ఆహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని బాలింతలు గర్భిణీలు, కిషోర బాలికలు తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారని తెలియజేశారు. కార్యక్రమానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురేష్, ఎంపిటిసి సభ్యురాలు సంగీత, సూపర్వైజర్లు కొమ్మరవ్వ, కవిత, మద్నూర్ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ముదిరాజులు చేరారనేది అవాస్తవం

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండకు చెందిన ముదిరాజు సంఘం కులస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారనేది అవాస్తవమని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్న లక్ష్మణ్ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని శివ రామ్‌మందిర్ ఆలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పున్న లక్ష్మణ్ మాట్లాడుతూ.. దోమకొండ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం కుల సభ్యులను కొందరు వ్యక్తులు సంఘం పేరుతో రామాయంపేటకు తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ చేరారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ముదిరాజ్ కులస్తులు ఏ పార్టీలో చేరలేదని ఆయన వివరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు అబ్రబోయిన రాజేందర్, అబ్రబోయిన రాజు, రాజానర్సు, కడారి రమేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరణి 5వ వార్షిక సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి రైతు వేదికలో ధరణి 5వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షతగా పొన్న పెద్దనర్సయ్య అధ్యక్షతన వహించారు. ధరణి ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. అనంతరం యఫ్.పి.ఓ ఎన్నికల బోర్డు నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. నూతన బోర్డు బాధ్యతలు విధుల గురించి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏపి మాస్, శ్రీనివాస్, కిషోర్, అమృత, రిలయన్స్ ప్రతినిధులు, రాజు, వీరేశం, వినయ్, బోర్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూర్ పట్టణంలోని గిద్ద హరిజనవాడ కాలనీకి చెందిన పరశురాం (30) గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం కడుపునొప్పి బాధ భరించలేక ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళ సమాఖ్య మండలాధ్యక్షులుగా పద్మావతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండల మహిళా సమాఖ్య-1 నూతన కార్యవర్గాన్ని శుక్రవారం బోధన్ మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం వినోద్ ప్రకటించారు. అధ్యక్షులుగా ఆర్.పద్మావతి (పెంటాకలాన్), ఉపాధ్యక్షులుగా పోషకళ (కుమ్మన్‌పల్లి), కార్యదర్శిగా వీ.ధనలక్ష్మీ (పెంటాఖుర్దు), సహాయ కార్యదర్శిగా షేక్ ఖైరున్నీసా (నాగన్‌పల్లి) కోశాధికారిగా కృష్ణకుమారి తదితరులు ఎన్నుకున్నట్లు ఏపీఎం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో నిర్వహించిన సంఘం ఆర్థిక లావాదేవీలు చర్చించినట్లు తెలిపారు.

రెంజల్‌లో ఫ్రైడే డ్రైడే

నవతెలంగాణ-రెంజల్

మండలంలో శుక్రవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఫ్రైడే అండ్ డ్రై డే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై ప్రజాప్రతినిధులు, అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని కందకుర్తి, దూపల్లి, నీలా గ్రామాలలో సర్పంచ్ మీర్జా కలీం బేగ్, దూపల్లి సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతలో చురుకుగా పాల్గొన్న పారిశుధ్య కార్మికులకు సన్మానించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు నవీన్, సిహెచ్ సాయి, ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, ఆరోగ్య కార్యకర్తలు జానకి, రాణి, సరోజ, శోభ, ఆశలు రేఖ, నాజియా బేగం, శ్యామల, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణాజివాడిలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

నవతెలంగాణ-తాద్వాయి

మండలంలోని కృష్ణాజివాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్టు ప్రధానోపాధ్యాయులు రామస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అందరూ సకాలంలో హాజరుకావాలని సూచించారు.

దుర్గ యూత్ గణేష్ మండలి వద్ద పూజలు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీలో దుర్గా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మెన్ సత్యం, ఏఎంసీ వైస్ చైర్మన్ రెడ్డి రాజు, దుర్గా యూత్ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న ఏపీఎం

నవతెలంగాణ-వర్ని

మహిళా సంఘాల సభ్యులు సమాజంలో ఆర్థికంగా ఎదగాలని వర్ని మండల ఏపీఎం ప్రసాద్ అన్నారు. మండల 18వ వార్షిక మహా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు వాడుకొని ఆర్థిక పరిపుష్టి సాధించాలని అన్నారు. సామాజిక అంశాలలో పాలు పంచుకొని మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని సూచించారు. వార్షిక ప్రగతి నివేదిక, ఆర్థిక నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఎంపీడీఓ బషీరోద్దీన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు, పాలకవర్గ సభ్యులు, సీసీలు, అకౌంటెంట్, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ కమిటీ అధ్యక్షులుగా సుధాకర్‌రావు నియామకం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన పెద్దల సుధాకర్‌రావును రామలయ కమిటీ అధ్యక్షులుగా నియమించినట్లు బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు రైతుబంధు జిల్లా డైరెక్టర్ ఎండి మౌలానా పేర్కొన్నారు. తనపై బాధ్యతతో రామాలయ కమిటీ అధ్యక్షులుగా నియమించిన మీరు గారికి కతజ్ఞతలు తెలియజేస్తూ, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని సుధాకర్ పేర్కొన్నారు.

గణేష్ మండపాలకు లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేసిన మాజీ మంత్రి

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని గ్రామాలలో ప్రతి గణపతి మండపాలకు లడ్డు ప్రసాదాలను అందజేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు గణేష్ నాయక్‌కు మాజీ మంత్రి షబ్బీర్ అలీ సూచించిన నేపథ్యంలో శుక్రవారం లడ్డు ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా కులమతాలు భేదాలు లేకుండా అందరూ కలిసి మెలిసి గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటాం

నవతెలంగాణ-మాచారెడ్డి

చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. మండలంలోని ఎల్లంపేటలో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాచారెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్ నగర్‌లో శుక్రవారం సర్పంచ్ పుప్పాల గంగాధర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటికీ బీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు, గ్రామంలో మంత్రి చేసిన అభివద్ధి పనులు ఓటర్లకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ప్రశాంత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపంచాలని కోరారు. గ్రామంలో మంత్రి చేసిన అభివద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికి అందజేశారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాలావతి ప్రకాష్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగం గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో ఫ్రైడే డ్రైడే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో శుక్రవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను, నీటి నిల్వ గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాడైన వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పాడైన వస్తువులలో ఎక్కువ రోజుల నుండి మీరు నిల్వ ఉంటే దోమలు వద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఇంటింటికి మరుగు దొడ్డి నిర్మించుకొని వాడుకోవాలన్నారు. పలు కాలనీలలో రోడ్డు వెంట పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఆశా వర్కర్లు పద్మ లక్ష్మీ నర్సు, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆకుల తిని నిరసన

నవతెలంగాణ-బాల్కొండ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులు చెట్ల ఆకులు తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జోగు రాంచంధర్ మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, భోజన కార్మికుల అక్రమ తొలగింపును ఆపాలని, మెనూ ఛార్జీలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచాలని, జీవో నెంబర్ 8 ప్రకారం పెరిగిన వేతనానికి , ఇప్పటివరకు ఇవ్వని ఏడు నెలల జీతంతో కలిపి ఇవ్వాలని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం, పిఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ నాయకులు గోదావరి, లక్ష్మి, బత్తుల సుజాత, తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో...

ధర్పల్లి: మండల అభివద్ధి కార్యాలయం ముందు ఏఐటీయూసి మండల సమితి ఆధ్వర్యంలో కార్మికులు ఆకులు, అలములు తిని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా 2022 మార్చిలో, ప్రతి ఒక్క మధ్యాహ్న భోజన కార్మికునికి నెలకు 3000 చెల్లిస్తానని హామీ ఇచ్చి 2023 జూన్ లో జీవో తెచ్చినప్పటికీ చెల్లించడంలేదని వాపోయారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు శారద, సునీత, లత, విజయ్, గాంధీ, పావని, సత్య గంగు, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని సిరికొండలో నాలుగు రోజులుగా నిరవధిక సమ్మెలో చేస్తున్న వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడి, సమస్యల్ని పరిష్కరించాలని ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన 3వేయిల రూపాయల వేతనాలు తక్షణం అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి ఇవ్వాలని, అలాగే వంట పాత్రలు, గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లు, ఐదు నెలలుగా బాకీ ఉన్న పెండింగ్ బిల్లులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎర్రన్న, కిషోర్,మధ్యాహ్న భోజన కార్మికులు రాయనర్సు, ప్రమీల, లక్ష్మి, బుచ్చవ్వతదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: నాలుగు రోజులుగా నిరవధిక సమ్మెలో పాల్గొంటున్న కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడి సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తాహసిల్దార్ రాజేందర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మురళి మాట్లాడుతూ.. మెనూ చార్జీలు పెంచాలని అన్నారు. దీనికి పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని, గ్రామంలో ఉన్న ప్రజాప్రతినిధులు సంపూర్ణ మద్దతు తెలపలన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాందాస్, మధ్యాహ్న భోజన కార్మికులు సులోచన, రాజమణి, లక్ష్మి, పోసాని, అశ్విని, సునీత, మనోహర్, బాలరాజు, లింగవ్వ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని బీఈడి కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

- పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు సతీష్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వ యూనివర్సిటీ నిబంధనలు పాటించని బీఈడి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల పిడిఎస్ యూ అధ్యక్షులు సతీష్ మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న బీడీ కళాశాలలు ప్రభుత్వ యూనివర్సిటీ నిబంధనలు పాటించకుంటే నడిపిస్తున్న మాఈడి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బోధన్ పట్టణంలోని చైతన్య కళాశాల, సెయింట్ థామస్ కళాశాల, ఎడపల్లిలోని అజన్ కళాశాల, కాటిపల్లి రవీందర్ రెడ్డి కళాశాల, కామారెడ్డి లోని బిఈడి కళాశాలలు ప్రభుత్వ యూనివర్సిటీ నిబంధనలు పాటించకుండ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం లేదన్నారు. ప్రాక్టికల్స్ విద్యార్థులతో చేయించడం లేదన్నారు. ల్యాబ్, లైబ్రరీ సౌకర్యాలు ఈ కళాశాలలో లేవన్నారు. కళాశాల డెవలప్మెంట్ పేరుతో ఇష్టారీతిన విద్యార్థుల దగ్గర నుంచి పీజులు వాసులు చేస్తున్నారన్నారని, అర్హత కలిగిన అధ్యాపకులను నియమించకుండా తూతూ మంత్రంగా చదువు చెప్పి పాత రికార్డులు విద్యార్థులకు ఇచ్చి అవే రాసుకుని రమ్మంటున్నారని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు అటెండెన్స్ పీజు పేరుతో వేలకు వేలు డబ్బులు వాసులు చేస్తున్నారన్నారు. యూనివర్సిటీ నిబంధనలు పాటించని కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.50వేల బ్యాంకు డిపాజిట్ పత్రాలు అందజేత


నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాస కొత్తూర్ గ్రామానికి చెందిన సూర్యవంశ అమోస్ అనే యువకుడు అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి కొన్ని రోజుల క్రితం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని మృతుని ఇద్దరు పిల్లల పేరు మీద చెరో రూ.25 వేల చొప్పున రూ.50వేలు డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు. మాట ప్రకారం ఇద్దరు పిల్లల పేరున రూ.25వేల రూపాయల చొప్పున మొత్తం రూ.50వేలు బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి వారికి చేయుత నిచ్చారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఫిక్స్ డిపాజిట్ బాండ్ పత్రాలను వారి కుటుంబానికి అందించారు. ఈ సంధర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంకేట రవి మాట్లాడుతూ అధికారం, పదవి ఉన్న లేకున్నా పేద వర్గాల ప్రజల బాధలు, కష్టాలు తెలుసుకుంటూ కష్టాల్లో ఉన్న ప్రజలకు గత15 ఏళ్ళుగా ఆర్థిక సహాయాలు చేస్తూ ముత్యాల సునీల్ కుమార్ ప్రజల గుండెల్లో నిలిచి పోయారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగేల ప్రవీణ్, నాయకులు బుచ్చి మల్లయ్య, మనోహర్, పాలేపు నర్సయ్య, శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమ్మె నోటీసు అందజేత

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మె నోటీసును శుక్రవారం ఎంపీడీవో లింగం నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భం గా మండల ఆపరేటర్ల సంఘం నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ... తమను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జూనియర్ అసిస్టెంట్ హెూదా కల్పించి ప్రభుత్వ పరంగా జీతాలు అందజేయాలని అన్నారు. తమ కుటుంబంలో ఎవరు మరణించినా కూడా వారికి కారుణ్య నియామకంద్వారా తీసుకోవాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు వేతనంతో మంజూరు చేయాలని తెలిపారు. సంబంధం లేని డిపార్మెంట్లలో పనులను చేయిస్తున్నారన్నారు. కానీ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా వెట్టి చాకిరి చేయిస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే వారం రోజుల తర్వాత సమ్మె చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి దయ తలచి తమ డిమాండ్లను పరిష్కరించాలని బంగారు తెలంగాణలో మమ్మల్ని కూడా భాగస్వాములు చేసి మా కుటుంబాలలో వెలుగు నింపాలని వారి ఆవేదన వ్యక్తం చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

- టీపీసీసీ నగేష్‌రెడ్డి


మాట్లాడుతున్న నగేష్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నియోజకవర్గంలో అభివద్ధి శూన్యమని, పేద ప్రజలకు రెండు పడక గదుల ఇల్లు ఇవ్వలేదని, ప్రస్తుత ఎమ్మెల్యే మోస పూరిత మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని కాంగ్రెస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి నగేష్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని రాంనగర్, శ్రీనగర్ మరియు శాస్త్రి నగర్ గ్రామంలో ఈసందర్భంగా సోనియా గాంధీ ప్రకటించిన ఆరు పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. మహాలక్ష్మి పథకంద్వారా ప్రతి నెల మహిళలకు 2500, 500రూపాయలకే గ్యాస్ సిలిండర్, బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం అందజేస్తామన్నారు. గహ జ్యోతి ద్వారా ప్రతి కుటుంబానికి 200యూనిట్ల ఉచిత కరెంటు, రైతు భరోసాలో ప్రతి ఏటా రైతుకు రూ.15వేలు పెట్టుబడి, వ్యవసాయ కూలీలకు 12వేలు, వరి పంటకి 500రూపాయల బోనస్ అందజేస్తామని తెలిపారు. చేయూత పథకంలో 4వేల ఆసరా పింఛను, 10లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా, యువ వికాసం ద్వారా విద్యార్థులకు 5లక్షల రూపాయల విద్యా భరోసా కార్డు అందజేస్తామని చెప్పారు. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్, ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, ఇంటి కోసం 5లక్షల ఆర్థిక సాయం, ఉద్యమ కారులకు 250గజాల ఇంటి స్థలం అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య, ఎస్‌టీ సెల్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, మోపాల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ రవి , మల్లేష్, తాహిద్, ఖలీం, సన్నీ, రాజు, పెంచల్ రెడ్డి,రాజారెడ్డి, మస్తాన్, కార్యకర్తలు పాల్గొన్నారు

డిచ్‌పల్లిలో ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళా

- ప్రారంభించిన డిఎంహెచ్ఓ సుదర్శనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవలో భాగంగా డిచ్‌పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మేళాను ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం సుదర్శనం పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ సుదర్శనం మాట్లాడుతూ... ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను సామాజిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని డిచ్ పల్లి, ఇందల్ వాయి మండలాల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ కూడా ఈ శిబిరంలో పాల్గొని ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల ప్రజా ప్రతినిధులు ప్రజలందరూ పాల్గొనేలా చూడాలని కోరారు. ప్రత్యేక వైద్య నిపుణులైన డాక్టర్ సందీప్ పిల్లల వైద్య నిపుణులు, డాక్టర్ సజన్ జనరల్ మెడిసిన్, డాక్టర్ పవన్ జనరల్ సర్జన్, డాక్టర్ రేఖ శ్రీ వైద్య నిపుణులు, డాక్టర్ ప్రమోద్ కుమార్ చెవి ముక్కు గొంతు వైద్య నిపుణులు, డాక్టర్ ఉమామహేశ్వరి కంటి వైద్య నిపుణురాలు, డాక్టర్ రవితేజ మానసిక వైద్య నిపుణులు, డాక్టర్ రాఘవేందర్ ఆర్థో వైద్య నిపుణులు, డాక్టర్ వెంకటేష్ , డాక్టర్ సుశాంత్ ,డాక్టర్ సంతోష్ క్యాంప్ ఆఫీసర్ పాల్గొని వివిధ వ్యాధి గ్రస్తులకు రోగ నిర్ధారణ చేసి చికిత్స అందించారు. ఈ శిబిరంలో మొత్తం సుమారు 349 మంది వ్యాధిగ్రస్తులకు చికిత్స అందజేశారు.


ఆయుష్మాన్ భవ ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌వో

కార్యక్రమంలో డిపిఓ విశాల, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, హెచ్ ఇ ఓ వై శంకర్, ప్రకాష్, గోపి, మండలంలోని వివిధ ఆరోగ్య ఉప కేంద్రాల నుండి ఎమ్మెల్ హెచ్ పీ లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంట్రాక్ట్'

- సీపీ సత్యనారాయణ
- ఆరో పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీ
- పలు వాహనాలు స్వాధీనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శుక్రవారం టౌన్ ఆరు పరిధిలో రామ్ నగర్, నెహ్రూనగర్, సారంగపూర్‌లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో కమ్యూనిటి కాన్ టాక్టు ప్రోగ్రామ్ కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో భాగంగా దాదాపు 150 మంది పోలీస్ సిబ్బందితో వాహనాల డాక్యూమెంట్లు ఉన్నాయా.. లేదా అని వారిని ఆరాతీశారు. ఎలాంటి కాగితాలు, నెంబర్‌ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలు 82, ఆటోలు 31, కార్లు 2, లారీలు 2 స్వాదీనం చేసుకున్నామన్నారు. మట్కా నిర్వాహకులు అబ్దుల్ సాజీద్, సయ్యద్ షాదుల్లాపై మట్కా కేసు నమోదు చేశామని తెలిపారు. బెల్ట్ షాపులపై దాడి చేసి 248 లిక్కర్ బాటిల్స్ స్వాదీనం చేసుకొని వారిపై కేసులునమోదు చేసినట్టు చెప్పారు. మొరంతోగల లారీ సీజ్ చేసి తహసీల్దార్‌కు పంపామని తెలిపారు. సైబర్ నేరాలు చేసే వారి ఉచ్చులో పడకూడదని, ఎలాంటి పరిచయం లేని వారు ఆన్లైన్ ద్వారా మన సమాచారం అడిగినట్లయితే ఇవ్వరాదని, పిల్లలకు ఫోన్లు ఇవ్వరాదని, బ్యాంక్ నుండి మాట్లాడుతున్నామనీ మన బ్యాంక్ సమాచారం అడిగిన ఇవ్వరాదని అన్నారు. ప్రతి ఒక్కరు వారి వారి పరిధిలో సి.సి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ పోలీస్ కమీషనర్ (ఎల్అండ్ఓ) ఎస్. జయారామ్, నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్, సిఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, మహిళా పోలీస్, మహిళాహెూమ్ గార్డులు, పోలీస్ సిబ్బంది, నేహ్రూ నగర్, రాంనగర్ సర్పంచులు అమానుల్లా, జిలానీ, ఎంపిటిసి స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవ పక్షోత్సవాల సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ పారిశుధ్య ట్రాక్టర్‌లో వేస్తున్న పలువురికి సన్మానం చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రేణుక దేవి, మాజీ ఎంపీపీ నాగభూషణం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం సాయన్న,, అంగన్వాడీ టీచర్ సుజాత ,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఎపిఎం సువర్ణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి


ప్రభుత్వం ప్రవేశపెట్టిన అయా సంక్షేమ పథకాలను, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని ఇందల్ వాయి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఎపిఎం సువర్ణ అన్నారు. ప్రధాన మంత్రి ఫుడ్ ప్రొసెస్ స్కీమ్‌లో బాగంగా ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో పిఎంఎఫ్ఎంఈ పథకంలో పిండి గిర్నిని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిండి గిర్ని నెలకొల్పడానికి పిఎంఎఫ్ఎంఈ ద్వారా 2 లక్షల రూపాయలకు గాను 70 వేల రూపాయల సబ్సిడీ వచ్చిందని, మిగిలిన డబ్బును లాబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇలా ఏదైనా పథకం ఉన్నప్పుడు అవసరమైన వారు సద్వినియోగం చేసుకుని తమ వ్యాపారాన్ని వద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి ఫుడ్ ప్రొసెస్ స్కీమ్‌లో ఇంక అనేక రకాల పథకాలు ఉన్నాయని, అవసరం ఉన్నా వారు ఇందల్ వాయి మండల కేంద్రంలోని కార్యాలయం లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమం లో డ్వాక్రా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పిండిగిర్నిని ప్రారంభిస్తున్న సర్పంచ్

సంపద వనాలను సందర్శించిన డిఆర్డిఓ

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని బస్సాపూర్ గ్రామంలో శుక్రవారం సంపద వనాలను డీఆర్డిఓ చందర్ నాయక్ సందర్శించారు. అనంతరం మండల పరిధిలోని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌తో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పండ్లతోటల పెంపకం, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, పల్లె ప్రకతి వనాలు, ఎవెన్యూ ప్లానిటేషన్, తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపిఓ వెంకటేశ్వర్లు ఏపీవో ఇందిరా, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.


సంపద వనం పరిశీలిస్తున్న అధికారి

పాస్‌పోర్ట్‌లో పేరు మార్పు

సమస్త ప్రజలకు తెలియాజేయునది ఏమనగా నా పూర్తి పేరు సుంకోజీ. కౌసల్య W/o సుంకోజీ.నీలకంఠం ఇంటి నెం: 5-15 గ్రామం, లక్కోర మం॥ వేల్పూర్. జిల్లా, నిజామాబాద్ పిన్ కోడ్ 503311. పాస్‌పోర్ట్ హోల్డర్ నెం: G2261628 అను నా యొక్క పాస్‌పోర్ట్‌లో నా పేరు సుంకోజీ. కంసల్య అని ఉంది. కాని నా అసలు పేరు సుంకోజీ కౌసల్య అని సరియైనదని తెలియజేయుచున్నాను.

సీఎంఆర్ఎఫ్ చెక్కుఅందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గంగ మోహన్ గౌడ్ కు సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ ద్వారా లక్ష రూపాయల చెక్కును మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్ శుక్రవారం అందజేశారు. ఎంపీటీసీ పోతేరాజు , సర్పంచ్ దేవరాజ్ ,పిఎసిఎస్ వైస్ చైర్మన్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డి వెంటే మేము..

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణ కేంద్రంలోని 1300 మైనార్టీ కుటుంబాలు మంత్రి ప్రశాంత్ రెడ్డికి మద్దతు గా ఉంటామని కమిటీ అధ్యక్షుడు అంజుమ్ ఆధ్వర్యంలో తీర్మానం చేసి బిఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు దొనకంటి నరసయ్య, మల్లెల లక్ష్మణ్ కన్నె సురేందర్ లకు అందజేశారు. అలాగే బడా భీంగల్ 30 కుటుంబాలు, సికింద్రాపూర్ 50 కుటుంబాలు, గోను గోపుల 35 కుటుంబాలు, బాబాపూర్ 500 కుటుంబాలు మంత్రి అండగా ఉంటామని ఏకగ్రీవ తీర్మానాలు చేసి అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మోయిస్, నాయకులు పాల్గొన్నారు

గణేష్ మండపం వద్ద అన్నదానం

నవతెలంగాణ-ముప్కాల్

కొత్తపల్లి గ్రామంలో గురడిరెడ్డి కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినాయక మండపం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం విజయవంతం చేసినందుకు గ్రామస్తులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలలో గణేష్ మండపాలవద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు. శనివారం మండల కేంద్రంలోని జేపీ కాలనీ, ఎస్సి కాలనీల్లో అన్నదానం నిర్వహిస్తామని అందుకు భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు..

IN THE COURT OF THE II ADDL.DISTRICT JUDGE :: AT SANGAREDDY.
M.V.O.P.N.O 186 OF 2021

Between:
Kadicherla Pradeep Kumar.
...Claimant.
AND
G. Hanumanthu.
...Respondents.

To,
1. GulapallyHanmanthu @ Pochaiah S/o. Lalaiah Age: Major, Occ: Driver of the Lorry Ts-15-UC-3971 Masanpally Village, Nizambad District

WHEREAS the claimant filed the above case, claiming compensation for motor vehicle accident involving your vehicle against you and another. The case is posted to 27-09-2023 for your appearance. You are hereby required to appear on that day at 10:30 a.m. either in person or through pleader, failing which the matter will be decided as per law.

// BY ORDER OF THE COURT //
G. Vijay Shankar Reddy,
Advocate,
Sangareddy

BEFORE THE HONORABLE DEPUTY REGISTRAR OF CHITS AT NIZAMABAD
I. A. No. 91/2023
IN
Dispute No. 308/2022

Between:
Vijayasridipthi Chits Private Limited, Bodhan, Dist: Nizamabad. Represented by its: Director Smt. G. Vijaya.
...Disputant
VERSUS
Mohammad Rafik and Others
...Opponents

To
Opp. No. 2 Sri M. A. Nayeem, S/o. M. A. Quyyum, M.I.G. 2-139, New Housing Board Colony, Town &Dist: Nizamabad, T. S., PIN-503002. Mobile No. 9963806803.

The Disputant has filed the dispute for recovery of amount and summon/notice sent on your address are unserved. Whereas the dispute is posted for your appearance on 04-10-2023 at 11:30 A.M. you are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided exparte.

// BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS//

Sd/- Deputy Registrar of Chits Nizamabad

BEFORE THE HONORABLE DEPUTY REGISTRAR OF CHITS AT NIZAMABAD
I. A. No. 89/2023
IN
Dispute No. 306/2022

Between:
Vijayasridipthi Chits Private Limited, Bodhan, Dist: Nizamabad. Represented by its: Director Smt. G. Vijaya.
...Disputant
VERSUS
Yadadri Agencies Proprietor: L. Bhoomaiah and Others
...Opponents

To
Opp.No.1 Sri. Yadadri Agencies Proprietor: L. Bhoomaiah Partner: L. Bhoomaiah, H. No. 1-3-178, Market Committee Road, Azam Gunj, Bodhan, Dist. Nizamabad, Telangana State., PIN -503185. Mobile No. 9505285945.
Opp.No.2 Sri Gangula Devidas, S/o. G. Bhairnath, R/o. H. No. 3-1-196, Thattikoat, Bodhan, Dist. Nizamabad, Telangana State., PIN-503185. Mobile No. 9948046735.

The Disputant has filed the dispute for recovery of amount and summon/notice sent on your address are unserved. Whereas the dispute is posted for your appearance on 04-10-2023 at 11:30 A.M. you are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided exparte.

//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS//

Sd/- Deputy Registrar of Chits Nizamabad

BEFORE THE HONORABLE DEPUTY REGISTRAR OF CHITS AT NIZAMABAD
I. A. No. 92/2023
IN
Dispute No. 309/2022

Between:
Vijayasridipthi Chits Private Limited, Bodhan, Dist: Nizamabad. Represented by its: Director Smt. G. Vijaya.
... Disputant
VERSUS
Nagula Ramchandar and Others
... Opponents

To
Opp.No.1 Sri Nagula Ramchandar, S/o. N. Narsaiah, H. No. 4-94/2, Kaldurki (Vill. & Po.), Bodhan (Mdl.), Dist: Nizamabad, T. S., PIN -503185. Mobile No. 9848203567.
Opp.No.2 Sri Nagula Saichandar, S/o. N. Ramchandar, H. No. 4-94/2, Kaldurki (Vill. & Po.), Bodhan (Mdl.), Dist: Nizamabad, T. S., PIN -503185. Mobile No. 9912150927.
Opp.No.3 Sri Payarla Raja Goud, S/o. P. Saya Goud, H. No. 4-2-122/2, Sri Venkateshwara Colony, Bodhan, Dist: Nizamabad, T. S., PIN-503185, Mobile No. 9849062348.

The Disputant has filed the dispute for recovery of amount and summon/notice sent on your address are unserved. Whereas the dispute is posted for your appearance on 04-10-2023 at 11:30 A.M. you are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided exparte.

//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS//

Sd/- Deputy Registrar of Chits Nizamabad

BEFORE THE HONORABLE DEPUTY REGISTRAR OF CHITS AT NIZAMABAD
I. A. No. 90/2023
IN
Dispute No. 307/2022

Between:
Vijayasridipthi Chits Private Limited, Bodhan, Dist: Nizamabad. Represented by its: Director Smt. G. Vijaya.
...Disputant
VERSUS
Nagula Saichandar and Others
...Opponents

To
Opp.No.1 Sri Nagula Saichandar, S/o. N. Ramchandar, H. No. 4-94/2, Kaldurki (Vill. & Po.), Bodhan (Mdl.), Dist.: Nizamabad, Telangana State., PIN-503185. Mobile No. 9912150927.
Opp.No.2 Sri Muddam Venkatesh, S/o. Rajanarsaiah, H. No. 5-23, Chakunta (Vill.), Choppadhandi (Mdl.), Dist.: Karimnagar, Telangana State., PIN -505415. Mobile No. 8978278358.
Opp.No.3 Sri. Nagula Ramchandar, S/o. N. Narsaiah, H. No. 4-94/2, Kaldurki (Vill. & Po.), Bodhan (Mdl.), Dist.: Nizamabad, T. S., PIN -503185. Mobile No. 9848203567.

The Disputant has filed the dispute for recovery of amount and summon/notice sent on your address are unserved. Whereas the dispute is posted for your appearance on 04-10-2023 at 11:30 A.M. you are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided exparte.

// BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS//

Sd/- Deputy Registrar of Chits Nizamabad

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | సెప్టెంబర్ 23, 2023 | www.navatelangana.com

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

టిఎస్ఆర్టిసి చైర్మన్ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు, బాజిరెడ్డి గోవర్ధన్ ఏబిటీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ, నిజామాబాద్ జిల్లా బంజారా నాయకులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బంజార భవనం భూమిపూజకోసం శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానించారు. 33శాతం మహిళా రిజర్వేషన్ వచ్చినందుకు శుభాభివందనలు తెలిపారు. శాసనసభ్యులు కోటి రూపాయలు సొంత నిధులు, కోటి 1 రూపాయలు ఎమ్మెల్సీ నిధులు ట్రైబల్ వెల్ఫేర్ నుండి కోటి పది లక్షల రూపాయలతో పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్రబంజారా నాయకులు మోహన్ నాయక్, మోహన్ సింగ్ నాయక్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పిటిసిలు, బంజారా భవన నిర్మాణ సమితి చైర్మన్ శ్రీహరి నాయక్ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యపై వినతి


వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

నవతెలంగాణ-ధర్పల్లి

జిల్లా వ్యాప్తంగా 61 సంవత్సరాలు నిండిన విఆర్ఏ లు శుక్రవారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఏఓ ప్రశాంత్‌కు కలిసి వినతి పత్రం అందించినట్లు విఆర్ఏల జిల్లా అధ్యక్షుడు చెలిమెల రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 61 సంవత్సరాలు నిండిన విఆర్ఏల కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కేవలం 10,500 వేతనంతో వెళ్లదీస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ అధ్యక్షుడు అబ్బులు, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు గంగ మల్లు,విఆర్ఏ లు కిరణ్, జలంధర్, ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరిని మార్చుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తాం

- అంగన్‌వాడీ టీచర్ల ఒకరోజు దీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ వైఖరిని మార్చుకోక పోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రమేష్ బాబు, అంగన్వాడి యూనియన్ వ్యవస్థాపక నాయకులు రామ్మోహన్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 12వ రోజు అంగన్వాడీ సమ్మెలో భాగంగా సమ్మెలో భాగంగా అంగన్వాడి టీచర్లకు ఒక రోజు రిలే దీక్షను అంగన్వాడీ యూనియన్ వ్యవస్థాపక నాయకులు కే రామ్మోహన్ రావుతో ప్రారంభించారు. ఈ దీక్షలో జిల్లాలోని ఐదు ప్రాజెక్టుల నాయకులు, సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. 12 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తూ ఉంటే సమస్యలను పరిష్కరించే బదులు ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగులకు దేశంలో ఎవరూ ఇవ్వనంత వేతనాలు ఇస్తున్నట్లు అబద్ధపు ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న పది ప్రాజెక్టుల్లో ఎక్కడ రాని సమస్యను డిచ్‌పల్లి ప్రాజెక్టు సి డి పి ఓ స్వర్ణలత అంగన్వాడీ ఉద్యోగుల్లో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని అన్నారు. ఉద్యోగాలను తీసేస్తానని బెదిరిస్తున్నారని, తన వైఖరిని మార్చుకోకపోతే జిల్లా వ్యాప్త ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే దేవగంగు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి స్వర్ణ, జిల్లా కోశాధికారి చంద్రకళ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మెను విరమించేది లేదని అన్నారు. ప్రభుత్వ వైఖరి మారకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని తెలిపారు. అందుకు జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. అధికారుల వేధింపులను మానుకొని సెంటర్ తాళాలను పగలగొట్టడం మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో జిల్లా నాయకులు మంగాదేవి, శివరాజమ్మ, సూర్య కళ, సందీప, సరిత, లావణ్య, గోదావరి, అరుణ, అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు. ముందుగా తమ సమస్యల పైన నినాదాలు చేస్తూ నిరసనను తెలిపారు.


ఆర్మూర్‌లో..


కంఠేశ్వర్:దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీ టీచర్లు


జక్రాన్‌పల్లిలో సమ్మెలో కూర్చున్న టీచర్లు


మోపాల్: మోకాళ్లపై నిరసన తెలుపుతున్న టీచర్లు

చెవిలో పువ్వుతో అంగన్వాడి టీచర్ల నిరసన

అంగన్వాడి టీచర్లకు లబ్ధిదారుల మద్దతు

జక్రాన్‌పల్లి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడి టీచర్లు ఆయాలు చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు చేపట్టిన అంగన్వాడి ఉద్యోగుల నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీ కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు గర్భిణీ స్త్రీలు బాలింతలు అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ సంతకాలు చేసి మద్దతు తెలియజేశారని తెలిపారు. మండలంలోని వందమంది అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మోపాల్: తాసిల్దార్ ఆఫీస్ ముందు దీక్ష చేపడుతున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మోకాళ్లపై నిలబడి తమ నిరసనను కొనసాగించారు. ముఖ్యమంత్రికి తమ సాధక బాధకాలు ఎప్పుడు అర్థమవుతాయి అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెలో రాజ్యలక్ష్మి, రజిత, సుమ, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని 12 రోజులుగా తహసిల్దార్ కార్యాలయం నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈసందర్భంగడా సిఐటియు మండల కన్వీనర్ కూతాడి ఎల్లయ్య మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లను పర్మినెంట్ చేయాలని సమాన పనికి సమాన వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఈఎస్ఐపీఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా ఐదు లక్షల ఇవ్వాలని అన్నారు. గర్భిణులకు, చిన్నారులకు పోషకారం అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు చేరవేస్తున్న అంగన్వాడి టీచర్లు టీచర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వము స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. సమస్యలను ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కరించని ఎడల ఎమ్మెల్యే, ఎంపీ ఇండ్లు ముట్టడించడానికి కూడా వెనకాడ బోమని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి ,జగదాంబ సునంద అంగన్వాడి టీచర్ల అధ్యక్షురాలు చంద్రకళ, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నూతన మండలంగా రామడుగు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- సంబరాలు జరుపుకున్న ప్రజలు

నవతెలంగాణ-ధర్పల్లి

రామడుగు ప్రాజెక్టు గ్రామస్థులు ఎదురు చూస్తున్న వారి కల ఎట్టకేలకు నెరవేరింది. కొత్త మండలంగా రామడుగు గ్రామాన్ని ప్రకటిస్తూ శుక్రవారం ప్రభుత్వం జిఓ జారీచేసింది. దీంతో ఇదివరకు ధర్పల్లి మండలం లోని రామడుగు, కేసారం, మైలారం, డిబి తండా, చల్లగర్గ గ్రామాలు విడిపోనున్నాయి. నూతన మండలంలోకి రామడుగు తోపాటు కేసారం, చల్లగర్గ, డీబీ తండా,మైలారం,కోరట్ పల్లి,కోరట్ పల్లి తండా, సుద్దులం గ్రామాలతో కొత్త మండలంగా అవతరించే అవకాశం ఉంది. ఈసందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఇచ్చిన మాట కు కట్టుబడి తమ గ్రామాన్ని మండలం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారుక. అనంతరం గ్రామములో ప్రజలు టపాసులు పేల్చి, ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు.

క్రీడాదుస్తులు వితరణ


క్రీడాదుస్తులు అందజేసిన దాతలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పిప్పెర అనిల్ క్రీడా దుస్తులను వితరణ చేశారు. రూ.14వేలు విలువైన 30 క్రీడా దుస్తులను శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అందజేశారు. గ్రామానికి చెందిన కుమ్మరి మహిపాల్ రూ.7వేల విలువైన రెండు బ్యాండ్ లను విరాళంగా అందించారు. దాతలకు ప్రధానోపాధ్యాయులు సిరిమల్ల దేవన్న కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అవారి మురళి, నాయకులు కొమ్ముల సంతోష్, సోమ దశరథ్, భూమేష్, పిఈటి మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు శిక్షణ


మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని మహిళ సహకార సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం శ్రీరాంసాగర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ బోర్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చందర్ నాయక్ , అదనపు డిఆర్డిఓ మధుసూదన్, కంపెనీ చైర్ పర్సన్ లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ శృతి పాల్గొన్నారు. సమావేశంలో డిఆర్డిఓ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ వర్షాకాలంలో వచ్చే పంటలైన సోయాబీన్, మక్కలు, ముఖ్యంగా పసుపు కొనుగోలు గురించి కంపెనీ బోర్డు సభ్యులకు వివరించారు.

బిల్లు పెట్టకపోతే బిజెపి దోషిగా నిలవడం ఖాయం

- ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశ పెట్టకపోతే చరిత్రలో బిజెపి దోషిగా నిలవడం ఖాయమని, బిజెపి మాదిగల ఆకాంక్షలు నెరవేర్చి అండగా ఉంటారో లేక మాదిగలకు శత్రువులుగా మిగిలిపోతారో తేల్చుకోవాలని ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు అన్నారు. ప్రస్తుత ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలోఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిజామాబాద్ కలెక్టరేట్ ముట్టడించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి జిల్లా ఇంఛార్జి గందమాల నాగభూషణం మాదిగ మాట్లాడుతూ.. ముప్పై సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతు ఇచ్చిన బిజెపి. ఈ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలలో వర్గీకరణ బిల్లును పెట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి మోడీ బిజెపి అగ్ర నాయకత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే మాదిగల ఆగ్రహానికి గురికావడం ఖాయం మని అన్నారు. ఎంఎస్పి జిల్లా కో ఆర్డనేటర్ డాల్ల సురేష్ మాదిగ మాదిగ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తె వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని 9 ఏళ్లుగా మాదిగలను మోసం చేస్తూ కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశం చివరి రోజు కాబట్టి ఎస్సీ వర్గీకరణ పెట్టకపోతే బీజేపీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఎంఎస్‌పిపార్టీ సీనియర్ నాయకులు మైలరం బాలు మాదిగ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం సమానత్వం కోసం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను దళితు లందరికీ అందాలంటే ఎస్సీ రిజర్వేషన్ల ఏ బి సి డి వర్గీకరణ జరగాలని డిమాండ్ చేశారు. తద్వారా 59 కులాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. బిజెపి, కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలు వర్గీకరణపై అనేక మార్లు హామీ ఇచ్చాయని గుర్తుకు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ రూరల్ నియేజకవర్గ కన్వీనర్ చెవూరి శ్యామ్ మాదిగ, ఎం ఎస్ పి అర్బన్ నాయకులు యదశి రాములు, ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి లక్ష్మంగరి భూమయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకారం రమేష్ మాదిగ, చంటి అమర్ మాదిగ, ఎమ్మార్పీఎస్. ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

యువత ఆదర్శమైన జీవితం గడపాలి

- ఆయేషా ఫాతిమా


అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా

నవతెలంగాణ- నవీపేట్

యువత ఆదర్శమైన జీవితాన్ని గడిపేలా కృషి జరగాలని ఎమ్మెల్యే షకీల్ అమీర్ సతీమణి ఆయేషా ఫాతిమా అన్నారు. మండల కేంద్రంలోని కుమ్మరి గల్లీలో గల వినాయక యూత్ గణేష్ మండలి వద్ద ఎమ్మెల్సీ కవిత భారత్ జాగృతి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాలు జరిపి అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత జీవితాల్లో మార్పు కలుగుతుందనే ఆశతోనే ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ లు వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. అలాగే పేదలకు ఆయేషా ఫాతిమా ట్రస్ట్ ద్వారా నిత్యవసర సరుకులను అందజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, నర్సింగ్ రావు, భారత్ జాగృతి జిల్లా అవంతి రావు, అబ్బన్న, తెడ్డు పోశెట్టి, ఎంపీటీసీ మీనా నవీన్ రాజ్, బుచ్చన్న, కిషోర్ రావు, సర్పంచ్ బత్తూరు సాయిలు, ప్రదీప్ రావు, సాయికుమార్, అర్షద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తు పెంచి బ్రిడ్జిని నిర్మించాలి

- అసహనం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, రైతులు..


పాత కాలువతో సమాంతరంగా నిర్మించిన బ్రిడ్జి

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్-కొత్తపల్లి ప్రధాన రోడ్డు మార్గాన వెళ్లే దారిలో ముప్కాల్ మండల కేంద్రానికి సంబంధించిన పెద్దవాగు ఉంది.కుంట్ల నుంచి నీరు పెద్దవాగు మీదుగా ముప్కాల్ గ్రామ ఊర చెరువులోకి ఆ నీరు చేరుతుంది. రెండు గ్రామాల మధ్య రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాగు ద్వారా నీరు నేరుగా చెరువులోకి చేరుకునేలా రోడ్డు మార్గాన ఉన్న చిన్న బ్రిడ్జి పనులు మొదలుపెట్టారు. పనుల్లో నాణ్యత లేదని, మూడు వరసల్లో చేపట్టాల్సిన పనులు రెండు వరసలో పూర్తి చేసి చేతులు దులుపుకున్నారని వాపోయారు. బ్రిడ్జి పనులు పాత కాలువతో సమానంగా నిర్మించడం పట్ల రైతులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మించిన బిడ్జిని ఎత్తు పెంచి మూడు వరసల్లో నిర్మిస్తే వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు ఉండేవికావని అంటున్నారు. బిడ్జిని ఎత్తును పెంచి మరలా పనులు చేయాలని గ్రామస్తులు, రైతులు అధికారులను కోరుతున్నారు. ఈ బిడ్జి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని అంటున్నారు.

మంత్రి మెప్పుకోసమే విమర్శలు

- హాసకొత్తుర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మంత్రి ప్రశాంత్ రెడ్డి మెప్పుకోసమే తమ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని హాస కొత్తుర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం మండలంలోని హాస కొత్తుర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామంలో రెండు రోజుల క్రితం సిద్ధార్థ్ హత్య విషయంలో ఆందోళన చేసిన 34 మంది గ్రామస్తులపై అధికార బలంతో అన్యాయంగా కేసులు పెట్టినందుకు నిరసనగా దీక్ష చేయడం జరిగిందన్నారు. నిరసన దీక్షకు మద్దతుగా కాంగ్రెస్ పెద్దలు ముత్యాల సునీల్ కుమార్, మానాల మోహన్ రెడ్డి గ్రామస్తులకు సంఘీభావం తెలిపి కేసుల భాదితులకు అండగా నిలిస్తే బీఆర్ఎస్ నాయకులు మంత్రి మెప్పుకోసం వాళ్ళను విమర్శించడం సిగ్గుచేట న్నారు. శవ రాజకీయాలు ఎవరు చేశారో అందరికీ తెలుసని, సిద్దార్థ్ హత్య జరిగిన రోజు అధికార పార్టీ పరువు పోతుందని, అధికార బలంతో కరోనా బూచిని చూపి శవాన్ని పూడ్చి పెట్టే ప్రయత్నం చేశారన్నారు. హంతకులను బీఆర్ఎస్ పార్టీ పెంచి పోషిస్తుందని విమర్శించారు. హత్య జరిగిన రోజు నుండి సిద్దార్థ్ కుటుంబానికి సునీల్ కుమార్ అండగా ఉన్నారని తెలిపారు. గ్రామస్తులు నిరసన దీక్షకు పిలుపునివ్వగానే సిద్దార్థ్ కుటుంబాన్ని బలవంతంగా మంత్రి దగ్గరకు తీసుకువెళ్ళారని ఆరోపించారు. నిరసన దీక్ష వల్లే మతుడి కుటుంబానికి సహాయం అందిందన్నారు. బీఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే మంత్రితో మాట్లాడి గ్రామస్తులపై పెట్టిన కేసులు తీసివేయించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఇటువంటి హత్యలు జరగకుండా గుండాలను నియంత్రించమని మంత్రికి చెప్పాలని సూచించారు. సమావేశంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

సంఘ భవనాల ప్రొసీడింగ్స్ కాపీలు అందజేసిన మంత్రి


ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న మంత్రి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని వివిధ గ్రామాలలో సుమారు రూ.90లక్షలతో 19 కుల సంఘాలకు మంజూరైన నిధుల ప్రొసీడింగ్ కాపీలను ఆయా కులసంఘాల కమిటీ సభ్యులకు రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం అందజేశారు. మండలంలోని బషీరాబాద్ లో మహిళ భవన్ మరుగుదొడ్ల నిర్మాణం కోసం, చౌట్ పల్లిలో రజకవాడ కమ్యూనిటీ హాల్, రజకవాడ కమ్యూనిటీ హాల్ అదనపు వర్క్స్, గురడివాడ కమ్యూనిటీ హాల్-1, గురడివాడ కమ్యూనిటీ హాల్-2, ముదిరాజ్ వాడ కమ్యూనిటీ హాల్, శాలివాహనవాడ కమ్యూనిటీ హాల్ అదనపు నిర్మాణం, దూదేకుల వాడ కమ్యూనిటీ హాల్ అదనపు పనుల కోసం నిధుల మంజూరు పత్రాలు అందించారు. హాస కొత్తూర్‌లో పెద్దమ్మ టెంపుల్ కమ్యూనిటీ హాల్, పెద్దమ్మ టెంపుల్ కమ్యూనిటీ హాల్ అదనపు నిర్మాణం, విశ్వ బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్, కుమ్మరి శాలివాహన సంఘం కమ్యూనిటీ హాల్, నవయుగ సంఘం కమ్యూనిటీ హాల్, గంగపుత్ర సంఘం -1 కమ్యూనిటీ హాల్ అదనపు పనులు, గంగపుత్ర సంఘం -2 అదనపు పనుల నిర్మాణం, గంగపుత్ర సంఘం -3 కమ్యూనిటీ హాల్ అదనపు పనుల నిర్మాణం, గంగమ్మ టెంపుల్ అదనపు పనుల నిధుల మంజూరు పత్రాలు అందించారు. కమ్మర్ పల్లిలో మల్లన్న యాదవ సంఘం కమ్యూనిటీ హాల్, గురడిరెడ్డి కాపు మీది వాడ కట్టు సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధుల మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె డిమాండ్లను నెరవేర్చాలి

- మంత్రికి అంగన్వాడీ ఉద్యోగుల వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సమ్మె డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర రోడ్లు భవనాలు గహ నిర్మాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా ప్రశాంత్ రెడ్డికి అంగన్వాడి ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని హాస కొత్తూర్ చౌరస్తా వద్ద అంగన్వాడి ఉద్యోగులు మంత్రిని కలిసి వినతి పత్రం అందించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని, ఓపిక పట్టాలని మంత్రి ఈ సందర్భంగా ఉద్యోగులతో పేర్కొన్నారు. కాగా తమ డిమాండ్లు పరిష్కరించాలని, గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. మండల కేంద్రంలోని హాస కొత్తూర్ చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారంతో 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ... అంగన్వాడి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. చిన్నపిల్లల ఆలన పాలన, పోషక ఆహారం అందించడంలో ముందు బాగాన ఉంటున్న అంగన్వాడీలను ప్రభుత్వం చిన్నచూపు చూడడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ భీమ్ గల్ ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు యమున, మండల అధ్యక్షురాలు మంజుల, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

తాళ్ళ రాంపూర్ గ్రామానికి చెందిన చాకలి ఎడపెల్లి బోజమ్మ వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళడంతో ఆ కుటుంబానికి 5 వేల రూపాయలు పంపినట్లు స్థానిక నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు దేవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, నాయకులు దిబ్బ శ్రీనివాస్,బెజ్జారం భాను,క్యాతం నవీన్,శ్రీనివాస్,గడ్డం గంగిరెడ్డి,కరీం,గురువయ్య బాధిత కుటుంబానికి డబ్బులను అందించారు.

మున్సిపల్ కమిషనర్ హామీతో సమ్మె విరమణ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కమిషనర్ హామీతోరెండు రోజుల సమ్మను కార్మికులు శుక్రవారం విరమించిచారు. ఎనిమిది నెలల పీఆర్సీ బకాయిలు ఇవ్వాలని, వేతనాలు సక్రమంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన ఆధ్యర్యంలో మున్సిపల్ కార్మికులు రెండు రోజులు సమ్మె చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ కూలీలను మున్సిపల్ కార్మికుల స్థానంలో పనికి పెట్టడంతో కార్మికులు వారిని అడ్డుకున్నారు. దీంతో కమిషనర్ వచ్చి తాత్కాలిక కార్మికులను ఎందుకు అడ్డుకుంటున్నారని కార్మికులను ప్రశ్నించారు. దీంతో కమిషనర్‌తో బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ జిల్లా అధ్యక్షులు కె.మధు,మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బ్యాగరి అశోక్, కార్యదర్శి రాజేశ్వర్, నాయకులు చర్చలు జరిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. కార్మికుల ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు, 8 నెలల పీఆర్సీ బకాయిలు నవంబర్ లేదా డిసెంబర్ లో ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో సమ్మె విరమణ చేశారు. విజయం సాధించిన మున్సిపల్ కార్మికులకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ అభినందనలు తెలిపారు.